
వార్త
ఆదివారం
2 అక్టోబరు, 2022
జగన్మాతకు
జన హారతి



# తెలుగు, తమిళ భాషల్లో వెంకట్ ప్రభు సినిమా

ఇప్పుడు కోలీవుడ్ కథానాయకులు తమ సినిమాలు తమిళంతో పాటు అదే రోజున తెలుగులోనూ విడుదలయ్యేలా చూసుకుంటున్నారు. అదే విధంగా తెలుగు హీరోలు సైతం తమ సినిమాలు తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదలయ్యేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలుగు, తమిళ భాషల్లో చైతూ కథానాయకుడుగా ఓ సినిమా నిర్మితమవుతోంది. శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ సినిమాకి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నాడు. దర్శకుడిగా ఇది ఆయనకు పదకొండవ సినిమా కాగా, చైతూకి ఇరవై రెండవ సినిమా. ఇందులో చైతూ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి ఇళయరాజా, ఆయన తనయుడు యువన్ శంకర్ రాజా కలిసి పని చేస్తుండటం విశేషం. 'థ్యాంక్యూ' సినిమాతో డీలాపడిన చైతూకి ఈ సినిమాతో హిట్ పడుతుందేమో చూడాలి మరి. 'బంగార్రాజు' సినిమా తరువాత మరోసారి ఈ సినిమాతో చైతూ, కృతిశెట్టి జంటగా ప్రేక్షకులను అలరించనున్నారు.

---

# డిసెంబరులో 'సార్' చిత్రం విడుదల!

తమిళంలో వైవిధ్యభరితమైన పాత్రలను ఎంచుకోవడంలో సూర్య తరువాత స్థానంలో ధనుశ్ కనిపిస్తున్నాడు. తమిళంలో వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ నేరుగా తెలుగు సినిమాలు చేయడానికి ఆయన ఉత్సాహం చూపిస్తున్నాడు. అలా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆయన చేసిన సినిమా 'సార్'. విద్యా వ్యవస్థలోని లోపాలపై ఈ కథ ఉంటుందని వినికిడి. డిసెంబర్ 2వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో ధనుశ్ సరసన నాయికగా సంయుక్తమీనన్ అలరించనుంది. సితార.. త్రివిక్రమ్ బ్యానర్లపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చాలావరకు చిత్రీకరణను పూర్తి చేసుకుంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూర్చిన ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళంలోనూ అదే రోజున విడుదల చేయనున్నారు. ఒకేసారి రెండు భాషల్లో ఈ సినిమా ఫలితాలు ఎలా వుంటాయో చూడాలి మరి.



తారాతీరం

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
2 అక్టోబరు, 2022

## మంచి ముత్యాలు

ఈరోజు పశ్చాత్తాపపడి పొరపాటును సరిదిద్దుకో.
అది రేపటికి చాలా ఆలస్యం అవుతుంది.

- జార్జి బెర్నార్డ్ షా


## విషయ విశేషం

మనసు దోచే ఆక్సిడైజ్డ్ నగలు.... 4
'సంఘీ'భావం....5
స్థాయి విస్మరిస్తున్న సివిల్స్ అధికారులు
సమృద్ధికర జీవనమే..6
కవర్ స్టోరీ..8
జగన్మాతకు
జన హారతి
ఈవారం కవిత్వం..12
అమాయకపు చూపులు
పూల పండుగ 'సద్దుల బతుకమ్మ'...14
కథ.. 20
గెలుపు-ఓటమి
ప్రజలు నివసించే అగ్నిపర్వత.... 24
సాహిత్యం.. 29
తెలుగు భాషా వికాస స్వరూపం
చిత్రభారతి.. .30
చరిత్రను పరవశింపచేసిన కన్నడ సినిమా... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## వారానికోసారి విద్యార్థులకు భోజనం



మణిపూర్‌లోని తామెంగ్లాంగ్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ పామేని మిరకిల్ మాన్ అని పిలుస్తారు. పేదరికంలో పుట్టి పెరిగిన ఆర్మ్ స్ట్రాంగ్ టౌసెమ్ తామెంగ్లాంగ్ మధ్య సుమారు వంద కిలోమీటర్ల పొడవైన రోడ్డు వేయించాడు. అప్పటివరకూ రోడ్డువసతి లేక ముప్ఫై ఒక్క గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఆ రోడ్డుపైన దృష్టి పెట్టి ప్రభుత్వాన్ని సంప్రదించాడు. సమస్యని ఎంపీలూ, ఇతర రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. దాంతో ఆర్మ్‌స్ట్రాంగ్ తన ఫేస్‌బుక్ పేజీలో ఆ రోడ్డు గురించి వివరిస్తూ- విరాళాలు సేకరించడం మొదలుపెట్టాడు. ఆ విధంగా ఆరు నెలల్లో దాదాపు నలభై లక్షలు సమకూరాయి. కావలసిన డబ్బు సమకూరడంతో ప్రజల సహకారం తీసుకుని రోడ్డు వేయించాడు. నదుల పైన ఆనకట్టలు కట్టించాడు. ఆ తరువాత ఎన్నో మంచి పనులు చేశాడు. కొన్నాళ్లకి ఆ రాష్ట్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్నాక ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను వారానికోసారి ఇంటికి పిలిచి భోజనం పెట్టడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో పిల్లల కలలు, ఆశయాల గురించి తెలుసుకుంటూ కలెక్టర్ కార్యాలయం ఎలా పని చేస్తుందో వారికి చూపిస్తున్నాడు.



### వారాంతంలో కలెక్టరమ్మ వైద్యం

ఆకాంక్ష భాస్కర్ కలెక్టర్ హోదాలో వారమంతా బిజీ బిజీగా ఉంటుంది. ఆదివారం, సెలవురోజుల్లో మాత్రం డాక్టర్‌గా పేదలకు వైద్యం చేసి మందులు ఉచితంగా అందిస్తుంది. అలాగే మారు మూల ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడి సమస్యల గురించి తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తుంది. వైద్యం కోసం ఆమె బంగ్లాకు ఎవరొచ్చినా సేవలందించే ఆకాంక్ష పుట్టి పెరిగింది వారణాసిలో తల్లిదండ్రుల స్ఫూర్తితో డాక్టరైన ఆమె ఉద్యోగంలో భాగంగా ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. అక్కడ కనీస సౌకర్యాలు, సిబ్బందీ లేక రోగులు ఇబ్బందులను చూసి, వారికి వైద్యసేవల్ని అందించాలని కష్టపడి చదివి ఐఏఎస్ అయి పశ్చిమ బంగాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్‌గా పని చేసింది. జాయింట్ సెక్రటరీగా బదిలీ అయినా ఆమె సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.







# మనసు దోచే ఆక్సిడైజ్డ్ నగలు




**ఎప్పుడూ** ఒకే రకం నగలు ధరించాలంటే బోర్ కొడుతుంది ఎవరికైనా. బంగారు, వెండి నగలను వెంట వెంటనే మార్చలేం. తరచుగా కిట్టీ పార్టీలకి, చిన్న చిన్న ఫంక్షన్లకు వెళ్లేవారికి ఆక్సిడైజ్డ్ జ్యువెలరీ బెస్ట్ ఛాయిస్. ఆక్సీకరణ ప్రక్రియ ద్వారా వెండి రంగుని కొంచెం తగ్గించి నల్లని మెటల్‌గా మార్చి వీటిని తయారు చేస్తారు. కనుక వీటి ధర అందరికీ అందుబాట్లో ఉంటుంది. ఈ ఆభరణాలు వివిధ డిజైన్లలో లభిస్తాయి. సంప్రదాయ, ఆధునిక వస్త్రాలు.. ఇలా వేటిమీదకైనా ఈ నగలను ధరించ వచ్చు. యాంటిక్ లుక్‌తో పాటు ఎదుటివారిని ఆకర్షించేలా అన్ని వయసుల వారికి కావలసిన గాజులు, కంఠాభరణాలు, కమ్మలు మార్కెట్లో ఆక్సిడైజ్డ్ నగలు లభిస్తున్నాయి.



# 'సంఘీ' భావం



## స్థాయి విస్మరిస్తున్న సివిల్స్ అధికారులు

దేశంలోనే సివిల్స్ సర్వీసెస్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. కొందరు సివిల్స్ అధికారులు ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులను కూడా ఖాతరు చేయకుండా నిబంధనల మేరకు విధులు నిర్వహించి తమ ప్రత్యేకతను చాటి చెప్పారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన అధికారులు లెక్కకు మించి ఉన్నారు. కొందరు అధికారులు కార్పొరేట్ రంగంలోనో, వేరే వ్యాపార, వాణిజ్య సంస్థల్లో లక్షల రూపాయల జీతాలను వదిలిపెట్టి సివిల్స్ రాసి ప్రజలకు సేవలందించాలన్న దృక్పథంతో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా చేరిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కొందరు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు బదిలీపై వెళుతుంటే వేలాదిగా జనం తరలివచ్చి కాళ్లపై పడి వెళ్లవద్దని వేడుకున్న ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. వ్యవస్థలో అత్యున్నత స్థాయి హోదా సివిల్స్ అధికారులకు మాత్రమే ఉంది. వీరు అన్ని విషయాల్లో చురుగ్గా ఉండటమే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏది అవసరం, ఏ పనులు చేస్తే బడుగు, నిరుపేద ప్రజలకు మంచి జరుగుతుందన్న ప్రణాళికతో ముందుకు వెళతారు. ఒక సందర్భంలో గతంలో ముఖ్యమంత్రి సమావేశం జరుగుతుండగా రాజకీయాల ప్రస్తావన రావడంతో చీఫ్ సెక్రటరీ స్థాయిలో ఉన్న ఐఎఎస్ అధికారి అక్కడి నుంచి లేచి బయటకు వెళ్లిపోవడం జరిగింది. జిల్లాల్లో కొన్ని సున్నితమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా మంత్రులు, సీనియర్ నేతలు ఒత్తిడి చేసినా విధినిర్వహణ విషయంలో కఠినంగా వ్యవహరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొన్ని ప్రాంతాలు కొందరు అధికారుల హయాంలో మంచి జరిగిందని స్థానికులు దశాబ్దాలు గడిచినా సదరు అధికారిని గుర్తు చేసుకోవడం జరుగుతోంది. కాని ప్రస్తుతం క్రమంగా మార్పులు వస్తున్నాయి. జూనియర్ అధికారులే కాదు సీనియర్ అధికారులు సైతం రాజకీయాలపై ఆసక్తి కనబరచడమే కాకుండా ప్రత్యక్ష రాజకీయాల్లో భాగస్వాములు అవుతున్నారు. సభా వేదికలపైనే తమ స్థాయిని మరిచి స్థానిక మంత్రులను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. మరికొందరు అధికారులు వేదికలపైనే రాజకీయ నాయకులను అంబేద్కర్, మహాత్మాగాంధీ, బాహుబలి వంటి పదాలతో కీర్తించి ఆనందం పొందుతున్నారు. మరికొందరు అధికారులు ముఖ్యమంత్రికి కాళ్లమీద పడి నమస్కారాలు చేసి ఆశీస్సులు పొందుతున్నారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ఇంతగా దిగజారుడు విధానాలకు ఎందుకు పాల్పడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఒక సినిమాలో పోలీసు అధికారి చెప్పినట్లు పోలీసులు బదిలీ అయితే మరో పోలీసు స్టేషన్‌కే వెళతారని, రైల్వేస్టేషన్‌కు కాదని మీసం మెలేస్తాడు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తమ స్థాయిని మరిచి వ్యవహరించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు సీనియర్ అధికారులు పదవీ విరమణ తరువాత ప్రత్యేక హోదాల్లో కొనసాగడానికో, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కావాలన్న ఆకాంక్షతో ఇప్పటి నుంచే తమ పదవిని, అధికారాలను ఆయా రాజకీయ నేతల కాళ్ల ముందు పెట్టి దాసోహం అంటున్నారు. అంతేకాదు తాము ఎమ్మెల్యేగా పోటీచేయాలని ఆశించిన స్థానం ఉన్న జిల్లాకు పెద్దపీట వేసి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీనివల్ల విధి నిర్వహణలో సమతుల్యత దెబ్బతింటోంది. ఇలాంటి విధానాల వల్ల కొన్ని జిల్లాలకు అన్యాయం జరుగుతోంది. డైరెక్ట్ ఐఎఎస్, ఐపిఎస్‌ల కంటే పదోన్నతుల ద్వారా ఈ హోదాలో వచ్చిన వారిలో ఎక్కువ శాతం మంది ఈ విధంగా హోదాను మరిచి వ్యవహరిస్తున్నారు. ఇలాంటి చర్యల వల్ల ఆ ఒక్క వ్యక్తికో, అధికారికో మచ్చ వస్తే పర్వాలేదు కాని మొత్తం వ్యవస్థకే మాయని మచ్చగా నిలుస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, ముఖ్యమంత్రులు ఆయా హోదాల్లో ఎంతకాలం ఉంటారో తెలియదు. అయిదేళ్లకోసారి వారు తిరిగి ఎన్నుకోబడాలి. ఖచ్చితంగా వారే వస్తారన్న నమ్మకం లేదు. అయితే సివిల్స్ అధికారులు అలా కాదు. వారి పదవీకాలం కనీసం 30 సంవత్సరాలు ఉంటుంది. జిల్లా అధికారి స్థాయి నుంచి రాష్ట్రం, జాతీయ స్థాయికి వారి సేవలను అందించే అవకాశం కలుగుతుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న సదుద్దేశంతో అనేక ప్రత్యేక అధికారాలు వర్తింపచేస్తూ సివిల్స్ నిబంధనలు ఉంటాయి.

యుక్తవయస్సులోనే జిల్లా స్థాయిలో నాయకత్వం వహించే లక్షణాలను ఈ శిక్షణలో ఇస్తారు. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సక్రమంగా వినియోగం కావడం ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలకు మేలు చేయడానికి ఐఎఎస్ అధికారులు కృషి చేయాలి.

సమాజంలో బలమైన వర్గాల చేతిలో నలిగిపోకుండా బడుగుల మానప్రాణాలు కాపాడేందుకు ఐపిఎస్ అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఐపిఎస్, ఐఎఎస్ అధికారులు ఉన్నంత వరకు తమకు అన్యాయం జరగదన్న ధీమాను సామాన్యులలో కల్పించాలి. ప్రపంచంలో మరెక్కడా లేని సువిశాల ప్రజాస్వామ్యదేశంలో ధనికులు, నిరుపేదలు ఎలాంటి భీతి లేకుండా జీవనం సాగించడమే కాకుండా భవిష్యత్తులో అత్యున్నత స్థానాలు పొందడానికి ప్రతి ఒక్కరికి అవకాశం కలిగేలా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. అంతేకాని రాజకీయ నాయకులకు, బడాబాబులకు, వ్యాపార, వాణిజ్యవేత్తలకు సాగిలపడాల్సిన దుస్థితి అవసరం లేదు. ఒకరిద్దరు అధికారులు వ్యవహరిస్తున్న తీరువల్ల మొత్తం వ్యవస్థకే మచ్చగా మిగులుతోంది. ఈ విషయంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల సంఘాలు కూడా చొరవ తీసుకుని కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరును సరిదిద్దే ప్రయత్నం చేస్తే సివిల్స్ అధికారులపై సమాజంలో మరింత గౌరవం పెరిగే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# సమృద్ధికర జీవనమే సంతృప్తికి మార్గం

**మనలో చాలామంది భయం తో కూడిన లేమి మనస్తత్వంతో బాధపడుతూ ఉంటారు. భగవంతుడు మనకు ఎన్ని ఇచ్చినా వాటితో తృప్తిపడక, ఉన్నది సరిపోదు.. అనే భయం తో ఎప్పుడూ బాధపడుతూ బతికేస్తుంటాం.**

ఇలాంటి భయాలతో కూడిన మనస్తత్వం గలవారు ఎప్పుడూ తమకున్నది సరిపోదు, తమకు కావలసింది దొరకట్లేదు అనే బాధతోనే జీవితం మొత్తం గడిపేస్తారు. ఇలాంటి భయాలకు కారణం అతిగా మందు కొట్టడం, పేకాట ఆడటం, అతిగా తినటం, అతిగా డబ్బు సంపాదించడం వంటివి. ఇటువంటి అలవాట్ల వల్లే చాలామంది అవసరానికి మించి సంపాదించడం, అవసరానికి మించి ఖర్చు పెట్టడం, అవసరానికి మించి తినటం, అవసరాన్ని మించి విలాసాలకు బానిసలు అవుతూ వుంటారు. ఈ బలహీనతలను కనిపెట్టే వ్యాపారస్తులు మనల్ని పావులుగా వాడుకొని, వాళ్ల వస్తువుల్ని లేదా వాళ్ల సేవలను వినియోగించుకుంటే మనకు తృప్తి లభిస్తుందని మభ్యపెడుతూ ఉంటారు. మన జీవితం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా భవిష్యత్తు స్థిరంగా ఉండాలంటే మన మనస్తత్వాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. మన ప్రతి ఆలోచనలో సంతృప్తి తొంగిచూస్తే భవిష్యత్తుపై ఎటువంటి బెంగ ఉండదు. ఇటువంటి లేమి మనస్తత్వం గలవారిపై ఎన్నో పరిశోధనలు జరిగాయి. 1975లో



జరిగిన ఇటువంటి ఒక పరిశోధనా ఫలితాలు మనకు చాలా విచిత్రంగా అనిపిస్తాయి. ఒక మిఠాయి దుకాణం యజమాని ఒకే రకమైన రంగు గాజుసీసాలలో ఒకే రకమైన లడ్డూలను ఉంచాడు. ఒక దానిలో నిండుగా 20 లడ్డూలు ఉంచితే, మరొక ఖాళీ సీసాలో రెండు లడ్డూలు మాత్రమే ఉంచాడు. లడ్డూలు కొనడానికి దుకాణానికి వచ్చిన వినియోగదారులు నిండుగా ఉన్న సీసాలోని లడ్డూలు కాకుండా, ఖాళీగా ఉన్న సీసాలోని లడ్డూలను అడిగి తీసుకునేవాళ్లు. బహుశా దీనికి కారణం వారి అవగాహన మీద వారి మనస్తత్వ ప్రభావం ఎక్కువగా ఉండటమే. ఏవైతే తక్కువగా ఉంటాయో లేక ఎక్కువగా అమ్ముడు అవుతాయో అవే మరింత విలువైనవి అనే భ్రమలో వాళ్లు ఉండటమే దీనికి కారణం.

ఒక కొత్త సినిమా విడుదలయితే మొదటి రోజే సినిమా చూడాలని క్యూలో నిలబడటం లేదా ఆపిల్ ఐఫోన్ వంటి కొత్త వస్తువు మార్కెట్లో విడుదలయితే దానికోసం రోజుల తరబడి షాపుల చుట్టూ తిరగటం వంటివి కూడా ఈ మనస్తత్వానికి ఉదాహరణలే. ఊళ్లోని గొప్పవాళ్లందరూ తమ పిల్లలను ఏ పాఠశాలలో చేరుస్తారో, ఆ పాఠశాలలో సీట్లు తక్కువగా ఉన్నా, పోటీ ఎక్కువగా ఉన్నా మన పిల్లల్ని కూడా ఏదో విధంగా ఆ పాఠశాలలోనే చేర్పాలనుకోవడం దీనికి మరో ఉదాహరణ. ఏవైతే తక్కువగా ఉన్నాయో, వాటి కోసం పిచ్చిగా పాకులాడటం మానవ నైజం. ఈ మధ్య తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని కేవలం ఇంజినీర్గా, డాక్టర్గా మాత్రమే చూడాలనుకుంటున్నారు. వీటి కోసం వేలంవెర్రిగా లక్షలు పోసి సీట్లు కొని పిల్లలను చదివిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఈ మధ్య కాలంలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సు చదివిన వారికి సాఫ్ట్‌వేర్ రంగంలో ఐదు అంకెల జీతం వస్తుండటంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని కంప్యూటర్ కోర్సులు మాత్రమే చదివించాలని ఎగబడటమే ఇందుకు ఉదాహరణ.

ఇన్ని లక్షల మంది కంప్యూటర్ కోర్సుల కోసం ఎగబడుతుంటే ఎంతమందికి ఉద్యోగాలు వస్తాయి? అనేది ఒక్క క్షణం ఎవరు ఆలోచించట్లేదు. అందరూ వెళ్లేదారిలో అసంతృప్తిగా మనం నడిస్తే ఆ దారి ఇరుకవుతోంది తప్ప గమ్యం త్వరంగా చేరుకోలేం. మనదైన దారిలో మనం తృప్తిగా నడవటం నేర్చుకుంటే మనం అనుకున్న లక్ష్యాన్ని త్వరగా చేరుకోగలం.

మన భవిష్యత్తు ఏ చీకు చింతా లేకుండా ఉండాలి అంటే మన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. మనకున్నదాంతో తృప్తి పడుతూ వాటిలోనే సంతోషం వెతుక్కుంటూ ఉంటే ఏ బాధా మన దరి చేరదు. మన భావితరాలకు కూడా సంతృప్తిగా జీవించడం నేర్పాలి.

ఎక్కువ మంది తమ పిల్లలకు వారి పరిమితులను తెలియజేస్తూ ఉంటారు. దానివల్ల వారిలో ఒక రకమైన జడత్వం పేరుకుపోతూ ఉంటుంది. పరిమితులకు బదులు వారి దృష్టి వారికున్న అవకాశాల మీద సాధించగలిగితే వారి జీవితం సమృద్ధిగా సాగిపోతుందనటంలో ఏ సందేహం లేదు. మనకు అందనివాటి కోసం సమయం వృధా చేసుకునే బదులు, మనకు అందిన వాటితో అద్భుతాలు చేయటం నేర్చుకుంటే జీవితం సంతృప్తిగా మిగులుతుంది. పిల్లలకు మనం చదువు సంధ్యలలోనైనా, ఆటపాటలలోనైనా కొత్త అవకాశాలను పరిచయం చేసి వాటిలో వాళ్లు సంతృప్తికరంగా సమృద్ధిగా తమ ప్రతిభను కనబరిచేలా చేయగలిగితే వాళ్లు ఎన్నో అద్భుతాలు ఆవిష్కరిస్తారు. ఇక నుంచైనా వారి మేధస్సును పుస్తకాలలో ప్రశ్నలకు సమాధానం రాయడానికి పరిమితం చేయకుండా, వారి మెదడులో ఉద్భవించే సరికొత్త ఆలోచనలను ఆహ్వానించి పరిష్కారాలు కనుగొనే దిశగా ప్రోత్సహిద్దాం.

పీటర్ డైమండ్ రాసిన 'సమృద్ధికర జీవనం' అనే పుస్తకంలో మన భవిష్యత్తు మనం ఊహించినదానికంటే అద్భుతంగా ఉంటుందని వ్యాఖ్యానించాడు. ఒకపక్క శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పుల సహాయంతో జీవన ప్రమాణాలు పెరుగుతూ సుఖమయం అయిన జీవనానికి తివాచీలు పరుస్తూ ఉంటే మనం మన ఆలోచనలకు మాత్రం అడ్డుకట్ట వేసుకుని మానసికంగా వామనుల్లా మారిపోతున్నాం. ఇటువంటి ఆలోచన నుండి భయాల నుండి మనం బయట పడాలంటే మనం ముందుగా మనకున్న అవకాశాలను గుర్తించగలగాలి. వాటితోనే కొత్త దారులు ఏర్పరచుకోగలిగితే ఏ లక్ష్యం అయినా చేరుకోగలం. ఎప్పుడూ లేని వాటికోసం పాకులాడుతూ అవి దొరకకపోతే ఏమవుతుందనే భయంతో బతుకుతూ బాధపడే బదులు మనదైన దారిలో నడుస్తూ ఎటువంటి భయాలు లేకుండా ఆనందంగా గడపడమే ఉత్తమం. ఒకప్పుడు మనమందరం పొట్ట నింపుకోవడానికి జంతువులను వేటాడిన అనాగరికులం. నేడు





అవకాశాలను వేటాడుతున్న నాగరికులం. నాడు పులులు తోడేళ్లు, సింహాలు ఏవి ఎదురొచ్చినా భయం లేకుండా బతికినవాళ్లం, నేడు మనకు ఎదురయ్యే ఓటములు, కష్టాలు కన్నీళ్లను ఎదుర్కొని బతకలేమా?

కేవలం ఒక పరీక్షలో తప్పామని, చాలా మంది విద్యార్థులు తమ విలువైన జీవితాలను అంతం చేసుకుంటున్నారు. అంటే జీవితం విలువ కేవలం ఒక పరీక్షలో వచ్చే మార్కులతో సమానమా? దీనికంతటికీ కారణం పాఠశాల అనబడే నాలుగు ఇటుక గోడల మధ్య, పాఠాలు అనబడే అర్థంకాని అక్షరాలను బట్టి పడుతూ, కేవలం పరీక్షలలో ఏదో ఒక ర్యాంకు సాధిస్తే సరిపోతుంది అనుకోవటమే. "ఎప్పుడైతే చదువులు మొదలవుతాయో, అప్పుడు పిల్లలు తమ మేధస్సు తక్కువగా ఉపయోగించుకుంటారు" అన్న సోక్రటీస్ మాటలు నేటి తరాన్ని చూస్తూ ఉంటే నిజం అనిపిస్తున్నాయి. పిల్లలకు వాస్తవాలను విడమర్చి చెప్పకుండా అద్భుత కల్పనలతో కూడిన అల్లావుద్దీన్ అద్భుత దీపం వంటి కథలు చెబుతూ ఉంటే వారి మానసిక పరిణితి క్షీణిస్తుంది తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఈరోజు పిల్లలు చూస్తున్న టీవీ కార్యక్రమాలు, సినిమాలు వాస్తవ ప్రపంచానికి దూరంగా ఉండటం వల్లే వారి మెదళ్లు పరిపూర్ణంగా ఎదగలేకపోతున్నాయి అనటంలో ఏ సందేహం లేదు. సాంకేతికతను విజ్ఞాన శాస్త్రంలోని మూలాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగించుకోవాలి కానీ అభూత కల్పనలను వారికి పరిచయం చేయటానికి కాదు. ఇకనుంచి అయినా మన పిల్లలను గుంపులు గుంపులుగా మేకల మందలు పోటీపడే ర్యాంకుల కోసం ప్రోత్సహించకుండా, వేరొకరితో వారిని పోల్చకుండా, వారికి ఇష్టమైన దారిలో ప్రయాణించడానికి ప్రోత్సహిస్తూ ఆ దారిలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించడానికి వెన్నుదన్నుగా నిలిస్తే, వాళ్లు భవిష్యత్తులో అద్భుతాలు చేస్తారనటంలో సందేహం లేదు.



**- ఈదర శ్రీనివాసరెడ్డి**

దసరా ఆధ్యాత్మిక భావాలే కాదు.. అనేక సాంస్కృతిక సంరంభాలతో, ఉత్సాహభరితమైన కార్యక్రమాలతో సందడిగా జరుపుకునే పండుగ. ఈ పండుగలో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు అమ్మవారికి పూజలు చేసి, పదవ రోజు అమ్మ రాక్షసుల మీద సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమి అత్యుత్సాహంతో జరుపుకుంటారు.



# జగన్మాతకు జన హారతి

**ఈ** పండుగని నవరాత్రి అనీ, శరదృతువు మొదట్లో వచ్చే పండుగ కనుక శరన్నవరాత్రి అని, అమ్మవారిని పూజిస్తారు కనుక దేవీ నవరాత్రులని కూడా అంటారు.

ఈ సందర్భంగా బాల దగ్గర నుంచి పెద్ద ముత్తయిదుదాకా రోజూ ముత్తయిదువులని అమ్మవారి రూపంగా గౌరవించి పూజిస్తారు.

శాక్తేయులు ఈ పండుగ మొదటి మూడు రోజులు పార్వతిదేవికి, తరువాత మూడు రోజులు లక్ష్మీదేవికి, చివరి మూడు రోజులు సరస్వతీ దేవికి పూజలు చేస్తారు.

ఈ ముగ్గురు అమ్మలే కాదు, ఇంకా అనేక దేవీ దేవతల అంశలతో ఆవిర్భవించిన అవతారమే మహిషాసుర మర్దని.

ఈవిడ ఆవిర్భవించటానికీ, ఈ పండుగ జరుపుకోవటానికి కూడా కారణభూతుడు మహిషుడనే రాక్షసుడు. ఈయన ఘోర తపస్సు చేసి, బ్రహ్మదేవుడి నుంచి తనకి ఎవరివల్లా మరణం లేకుండా వరం పొందాడు. ఆ సమయంలో స్త్రీలంటే వున్న చులకన భావంతో, స్త్రీలు తననేం చెయ్యలేరనే అహంభావంతో వారిని నిర్లక్ష్యం చేశాడు. తర్వాత కథ మామూలే. వర గర్వంతో అందరినీ హింస పెట్టటం, దేవతలతో యుద్ధం చేసి, వాళ్లని ఓడించి ఇంద్ర పదవి చేపట్టటం.

అది భరించలేని ఇంద్రుడు త్రిమూర్తులను శరణు వేడటం, దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకోగా వారి నుండి వెలువడిన క్రోధాగ్ని ఒక ప్రకాశవంతమైన తేజంగా మారింది. ఆ తేజాలన్నీ కేంద్రీకృతమై ఒక స్త్రీ రూపంగా 18 చేతులతో సాక్షాత్కారించింది.

ఆమె రాక్షసులతో యుద్ధం చేసే శక్తి పొందటానికిగాను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే కాదు, మిగతా దేవతలంతా తమ తమ ఆయుధాలని ఆ మాతకి సమర్పించారు.

ఇలా సర్వ దేవతా శక్తుల ఆకారంగా, సర్వదేవతల ఆయుధాలనీ సమకూర్చుకొన్న ఆ మహాశక్తి మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన యుద్ధం చేసింది. మహిషాసురుని తరఫున యుద్ధం చేస్తున్న అసురులందరినీ సంహరించి తరువాత మహిషాసురునితో తలపడింది. వీరందరూ తొమ్మిది రోజులు ఆ మహాశక్తితో యుద్ధం చేసి సంహరింపబడ్డారు. అప్పటి నుండి

కవర్ స్టోరీ

పి.యస్.యమ్.లక్ష్మి

మహిషుని సంహరించిన అమ్మవారు మహిషాసుర మర్దనిగా పూజలందుకుంటోంది.

తొమ్మిది రోజులు యుద్ధం చేసిన ఆ తల్లి వివిధ దేవతల ప్రతిరూపమే కనుక ఆలయాలలో ఈ తొమ్మిది రోజులూ రోజుకొక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేస్తారు. దశమి రోజు విజయాన్ని సాధించిన విజయ దుర్గగా, రాజరాజేశ్వరీ దేవిగా అలంకరిస్తారు. ప్రాంతాలనుబట్టి

అమ్మవారి నామాలు, అలంకరణలు, నైవేద్యాలు మారుతుంటాయి. ఈ పది రోజులూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతూ వుంటాయి.

విజయ దశమికీ, రామాయణానికీ, భారతానికి కూడా సంబంధాలున్నాయి. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు లంకకి వెళ్లేముందు శమీ వృక్షానికి పూజ చేసి వెళ్లాడని, అందుకే రావణుడి మీద విజయం సాధించాడని ఒక కథనం. రావణాసురుని సంహరించిన రోజు విజయదశమి. అందుకనే ఆలయాలలో రావణాసురుని నిలువెత్తు విగ్రహాన్ని తయారుచేసి, సాయంత్రం దానిని దహనం చేస్తారు. భారతంలో అజ్ఞాత వాసానికి వెళ్లేముందు పాండవులు తమ తమ ఆయుధాలను ఒక జమ్మి చెట్టు మీద దాచారని, అజ్ఞాతవాసం పూర్తయిన తరువాత విజయదశమి రోజు వాటిని తిరిగి తీసుకున్నారంటారు. ఆ సమయంలో ఇంద్రుడు పాలపిట్ట రూపంలో వాటిని కాపాడాడనే కథనం కూడా వుంది. అంత ప్రాముఖ్యం వహించిన జమ్మిచెట్టును విజయదశమి రోజున పూజించి, దాని ఆకులను బంగారమని అందరికీ శుభాకాంక్ష లతో పంచే ఆచారం కొందరికి ఉంది. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయదశమి రోజున పూజలు అందుకొన్న జమ్మిచెట్టు ఆకులను ఇంట్లోని పూజా స్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుందని నమ్మకం. దక్షిణాది రాష్ట్రాలలో శమీ పూజతో పాటు విజయ దశమి రోజు పాలపిట్ట దర్శనం కూడా శుభ సూచకమనే నమ్మకం వుంది.

**ఆయుధ పూజ**

మహాశక్తి రాక్షసులతో యుద్ధం చేసి గెలిచినందుకు, పాండవులు ఆయుధాలు తిరిగి తీసుకున్న గుర్తుగా మహర్నవమి రోజున ఆయుధ పూజ (తాము వాడే పనిముట్లు, వాహనాలు వగైరా వాటికి) చెయ్యటం కూడా ఆనవాయితీగా వస్తోంది.

**సాంప్రదాయాలు**

దసరా అనేక సాంప్రదాయాల కలపోతగా చేసుకునే సరదా పండుగ. కొందరు ఈ పది రోజులూ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు (ముఖ్యంగా తమిళులు). మా చిన్నప్పుడు కొందరు వివిధ వేషాలతో వచ్చి వారి విద్యని ప్రదర్శించేవారు (పగటి వేషాలు అనేవాళ్లు.. పిట్టల దొర (కామా, ఫుల్‌స్టాప్ లేకుండా బడాయిలు చెబుతాడు. నూనె గుడ్డలవాడు (వంటి మీద ఎక్కువ గుడ్డలు నూనెతో తడిపినవి వేసుకుని వచ్చేవాడు). వారికి దసరా మామూలు అంటూ కానుకలు ఇచ్చి పంపేవారు. స్కూలుపిల్లలు కూడా టీచర్లతో కలిసి ఇంటింటికీ తిరిగేవాళ్లు (ఇదొక రకమైన గురుపూజేమో! అప్పుడు గురుపూజ గురించి మాకంతగా తెలియదు). "అయ్య వారికి చాలు ఐదు వరహాలు, పిల్లవాళ్లకి చాలు పప్పుబెల్లాలు.." అంటూ నేనూ తిరిగాను. ఆ సమయంలో వెదురు కర్రతో చేసిన రంగు రంగుల కాగితాలంటించిన విల్లం బులు ధరించేవాళ్లం. పిల్లలకి తినటానికి ఏమైనా పెట్టేవాళ్లు. టీచర్లకి కానుకలు ఇచ్చేవారు. ఈ సంప్రదాయం ఇప్పుడు మరుగునపడ్డట్లు వుంది. కానీ దసరా మామూళ్లు ఇంకా వున్నాయి.

**వివిధ ప్రదేశాలలో దసరా**

ముందుగా మన తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రదేశాలలో ఈ పండు జరిగే విధానం తెలుసుకుందాం.

**తెలంగాణ**

తెలంగాణలో దసరా సంబరాలతో పాటు అదే సమయంలో వచ్చే 'బతుకమ్మ పండుగ' కూడా చాలా పెద్ద పండుగ. ఒక పళ్లెంలో పువ్వులు గుండ్రంగా పేర్చి, దాని మీద పసుపుతో చేసిన అమ్మవారిని పెట్టి (బతు కమ్మ) సాయంకాలాలు మహిళలం దరూ గుమికూడి దాని చుట్టూ తిరుగుతూ, పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. దసరా తొమ్మిది రోజులూ జరిగే ఈ బతుకమ్మ పండుగ దుర్గాష్టమినాడు 'సద్దుల బతుకమ్మ' అని బతుకమ్మని నీటిలో వాలాడించటంతో ముగుస్తుంది.

**కరీంనగర్**

దసరా సమయంలో కరీంనగర్‌వాసులు అకాడాగా నిర్వహిస్తారు. ఇక్కడ గనిలో పని చేసే కార్మికులు ఈ పండుగను గ్రామీణ





వాతావరణం ఉట్టిపడేలా చేసుకుంటారు. క్షత్రియుల ఆయుధ విన్యాసాలు పోలిన విన్యాసాలను ప్రదర్శించడం ఇక్కడి సంప్ర దాయం. హనుమాన్ అకాడా, దుర్గా అకాడాల లాంటి దేవతల రూపాలతో ఇనుప బెల్టు, త్రిశూలం మొదలైన ఆయుధాలను పట్టుకొని అనేక విన్యాసాలతో ఊరేగింపులు చేస్తారు. కర్రసాము ఈ ప్రదర్శనలో భాగమే. జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకుంటారు.

**సంగారెడ్డి**

సంగారెడ్డిలో దసరా సందర్భంలో తొమ్మిది రోజులు దేవిని ఆరాధించి చివరి రోజున రావణకుంభకర్ణ బొమ్మలను దగ్ధం చేస్తారు.

**ఆంధ్రప్రదేశ్**

విజయవాడ భేతాళ నృత్యం

విజయవాడలోని ప్రధాన ఆలయాలలో బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం ప్రఖ్యాతి చెందింది. ఇక్కడ నవరాత్రి తొమ్మిది రోజు లు వైభవంగా ఉత్సవాలు నిర్వహించి విజయదశమి నాటికి కృష్ణా నదిలో తెప్పో త్సవం చేస్తారు. తర్వాత విజయవాడ నగర పోలీసులు అమ్మవారిని పాతబస్తీలో ఊరేగి స్తారు. దసరా సందర్భంలో చివరి రోజు ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. ఈ ప్రభల తో భేతాళ నృత్యం ప్రదర్శిస్తారు. ఈ భేతాళ నృత్య ప్రదర్శన విజయవాడ ప్రత్యేకత.

వీరవాసరం ఏనుగుల సంరంభం

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో చాలా సంవత్సరాల నుండి దసరా సమ యంలో ఏనుగు సంబరాలు జరపడం ఆచారంగా వస్తోంది. దసరా మొదటి రోజున

ఏనుగు గుడిలో భేతాళుడిని నిలబెడతారు. భేతాళుడంటే వయసైన బ్రహ్మచారి. తొమ్మిది రోజులు భేతాళుడు నియమ నిష్ఠలతో అమ్మవారి పూజలు నిర్వహిస్తాడు. వెదురు కర్రలు, గడ్డి, కొబ్బరిపీచుతో చేసిన ఏనుగును రంగు రంగుల కాగితాలతో తయారు చేసిన అంబారీతో అలంకరిస్తారు. అలాగే నూతనంగా చిన్న ఏనుగును



తయారు చేసి అలంకరించి చివరి రోజున బోయీలచే ఊరేగింపుగా తీసుకువెళతారు. ఈ ఊరేగింపులో పిల్లలను ఏనుగు కింద నుండి దాటిస్తారు. అలా దాటిస్తే పిల్లలు రోగ విముక్తులై ఆరోగ్యంగా ఉంటారని విశ్వాసం. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించి తెల్లవారి ఆరు గంటల వరకు సాగి తూరుపు చెరువు కట్టకు చేరుకొని ఈ ఉత్సవాన్ని ముగిస్తారు.

**విజయనగరం సిరిమాను**

విజయనగరంలో దసరా సమయంలో గజపతుల ఆడపడుచైన పైడితల్లికి పూజలు చేస్తారు. ఈ దేవికి దసరా వెళ్లిన తరువాత మొదటి మంగళవారం రోజున జాతర జరుపుతారు. ఈ ఉత్సవంలో భాగంగా పూజారిని సిరిమాను ఎక్కించి అమ్మవారి గుడి ఉన్న మూడు లాంతర్ల సెంటర్ నుండి కోట వరకు మూడు సార్లు ఊరేగిస్తారు.

**వీపనగండ్లలో రాళ్ల యుద్ధం**

కర్నూలు జిల్లాలోని వీపనగండ్లలో దసరా సమయంలో రాళ్ల యుద్ధం చేసుకుంటారు. దసరా రోజున సాయం వేళలో ప్రజలు కాలువ ఒడ్డున కాలువకు అటూ ఇటూ చేరి కంకర రాళ్లను గుట్టగా పోసుకుని ఒకవైపు రామసేన; మరొకవైపు రావణ సేనగా ఊహించి రాళ్లను విసురుతూ యుద్ధం చేసుకుంటారు. దీనిని వాళ్లు రామ-రావణ యుద్ధంగా అభివర్ణిస్తారు.

ఇదే సమయంలో ఇదే జిల్లాలోని దేవరగట్టు గ్రామంలోనూ 'బన్ని ఉత్సవం' జరుగుతుంది.

మాలమల్లేశ్వర స్వామి విగ్రహాన్ని తమ గ్రామానికి తీసుకువెళ్లేందుకు దాదాపు 18 గ్రామాల ప్రజలు, దేవరగట్టు నెలవై ఉన్న రెండు గ్రామాల పరిధిలోని ప్రజలతో కొట్లాడతారు. స్వామిని తీసుకువెళ్లేందుకు ఓ వర్గం, తమ గ్రామంలోనే ఉండేలా చూసుకునేందుకు మరో వర్గం ఎదురుపడి ఇనుప తొడుగులు తొడిగిన వెదురు కర్రలతో విపరీతంగా కొట్టుకుంటారు. ఎన్ని గాయాలైనా పట్టించుకోరు.

**బందరు శక్తిపటాలు**

కృష్ణా జిల్లాలో ఉన్న రేవు పట్టణం బందరులో దసరా సందర్భంగా శక్తి పటాల ఊరేగింపు నిర్వహిస్తారు. దాదాపు నూరు సంవత్సరాల క్రితం కలకత్తా నుండి బొందిలీలకు చెందిన సైనికుడు మచిలీపట్నం ఈడేపల్లిలో కాళీమాత ప్రతిష్ట చేశాడు. అప్పటి నుండి దసరా సమయంలో శక్తి ఆలయం నుండి శక్తిపటాన్ని పట్టుకుని పుర వీధులలో ఊరేగింపుగా తీసుకురావడం ప్రారంభం అయింది ఊరేగింపు సమయంలో పటాన్ని వీపుకు కట్టుకుని ముఖానికి అమ్మవారి భయంకర ముఖాకృతిని తగిలించుకుని నాట్యమాడుతూ వీధులలో తిరుగుతారు. పటం ధరించినవారు డప్పు శబ్దానికి అనుగుణంగా వీర నృత్యం చేస్తూ భయంకరాకృతిలో ఉన్న రాక్షసుణ్ణి సంహరిస్తున్నట్లు అభినయిస్తారు.

**ఒంగోలు కళారాలు**

దసరా సమయంలో ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉత్సవాలలో భాగంగా కళారాలకు (పెద్ద ముఖాకృతులు) విశేష పూజలు చేసి ఊరేగిస్తారు. ఇక్కడ కాళికాదేవికి, మహిషా మర్దినికి, నరసింహ స్వామికి కళారాలున్నాయి. కళారాన్ని అటూ ఇటూ ఊపుతూ డప్పుల మోతలతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఇలా కళారాన్ని ఊరి నడిమధ్యకు తీసుకువచ్చి అక్కడ రాక్షస సంహారం ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.

తెలుగువారే కాక ఇతర రాష్ట్రాలవారు కూడా దసరా వైభవంగా జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకి మైసూరు, బెంగాల్, గుజరాత్ మొదలయిన రాష్ట్రాలు పెట్టింది పేరు. మైసూరులో రాజుల కాలం నుంచీ భారీగా జరిగే దసరా ఉత్సవాలు చూడటానికి ఎక్కడెక్కడినుంచో ప్రజలు వస్తారు.

కలకత్తాలో దుర్గాపూజ పేరుతో జరిగే ఈ ఉత్సవాలలో తొమ్మిది రోజులు అమ్మవారిని పూజించి, అనేక భగవత్సంబంధిత కార్యక్రమాలు నిర్వహించి, చివరి రోజు కాళికా మాతని దర్శిస్తారు. ఆ రోజు కాళీమాతని లక్షల మంది దర్శిస్తారట. చివరి రోజు దుర్గామాతని హుగ్లీ నదిలో నిమజ్జనం చేస్తారు. ఆ రోజు నదీ తీరంలో కుమారీ పూజలు చేస్తారు.

ఒడిషా పౌరులు కటక్ కళాకారులు రూపొందించిన దుర్గామాత విగ్రహాలను వీధివీధిలో ప్రతిష్ఠిస్తారు. స్త్రీలు మానికలో వడ్లు నింపి లక్ష్మీదేవిగా భావించి పూజలు నిర్వహిస్తారు. దీనిని 'మానబాన' అంటారు. దశమి రోజు రావణ దహనం చేస్తారు.

గుజరాత్‌లో దసరా సమయంలో పార్వతీదేవిని ఆరాధిస్తారు. ఇంటిగోడల మీద శ్రీచక్రాన్ని, త్రిశూలాన్ని, శక్తి ఆయుధాన్ని పసుపుతో చిత్రించి పూజిస్తారు. పొలం నుండి తీసుకువచ్చిన మట్టితో వేదిక తయారు చేసి దానిపై బార్లీ, గోధుమ విత్తనాలను చల్లి, దానిపై మట్టికుండ పెట్టి, దానిని నీటితో నింపి, పోకచెక్క వెండి లేక రాగి నాణెం వేస్తారు. ఆ మట్టికుండను వారు దేవిగా భావిస్తారు. దానిని వారు కుంభీ ప్రతిష్ఠ అంటారు. ఈ ఉత్సవాలలో వీరు చేసే గర్బా, దాండియా నృత్యాలు చేస్తారు. ఈ ఉత్సవాల్లో స్త్రీలు, పురుషులు వివిధ రంగుల, ఎంబ్రాయిడరీ పనితో ఆకర్షణీయంగా వున్న దుస్తులు, నగలు ధరించి, గుండ్రంగా తిరుగుతూ ఉత్సాహంగా నృత్యాలు చేస్తారు.

ఇలా.. వివిధ ప్రదేశాలలో ఎన్నో రకాలుగా జరుపుకునే ఈ దసరా అమ్మవారి పూజలతో పది రకాల పాపాలు హరింపబడతాయని దశ హరాగా ప్రసిద్ధికెక్కింది.



# మనుషుల్ని చంపే అందమైన గార్డెన్

అందమైన గార్డెన్ ఏంటి? అది మనుషుల్ని చంపడం ఏమిటి? అనుకుంటున్నారా? యస్.. మీరు వినేది నిజమే. ప్రాణాలపై ఆశ లేకుంటేనే ఈ గార్డెన్‌లోకి వెళ్లాలి. అదో అందమైన ఉద్యానవనం. ఇందులో ఉన్న అందమైన ప్రతీ మొక్కా ప్రాణాంతకమే. చాలా మంది అందులోకి వెళ్లి అత్యంత అందమైన ఉద్యానవనం అనుకుంటారు. అయితే ఆ అందం వెనుక ప్రాణం తీసే మొక్కలు అడుగడుగునా ఉన్నాయనే విషయం మర్చిపోతా దారు. ఈ గార్డెన్‌లో నడుస్తుంటే మొక్కల వాసనకే స్పృహ తప్పిపడిపోతారు. అందుకే ఈ గార్డెన్ దగ్గర 'ఈ మొక్కలు మిమ్ములను చంపగలవు' అంటూ బోర్డులను కూడా ఏర్పాటు చేసి పర్యాటకులను హెచ్చరిస్తుంటారు. ఇంగ్లాండులోని నార్తంబర్ లాండ్ ప్రాంతంలో ఉన్న ఈ ప్రమాదకర ఉద్యానవనం పేరు 'ఆల్నివిక్ గార్డెన్'. ఇది ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన గార్డెన్‌గా గుర్తింపు ఉంది. గతంలో బ్రిటీష్ రాజకుమార్తెల్లో ఒకరు జాన్ పెర్సీ ఈ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయించాలని భావించారు. కానీ సాధారణంగా గార్డెన్‌ను ఏర్పాటు చేస్తే అందులో కిక్ ఏముంటుందని అనుకున్నారో.. ఏమో!




అందమైన, అద్భుతమైన విషపూరిత మొక్కలు, అరుదైన మొక్కలతో ఏర్పాటు చేయించారు. విశాలమైన స్థలంలో పెద్ద సంఖ్యలో చెట్లు, మొక్కలతో అలరారుతుండే ఈ ఉద్యానవనంలో దాదాపు 150 మొక్కలకు పైగా విషపూరిత మొక్కలు ఉన్నాయి. ఈ గార్డెన్‌కు జాన్ పెర్సీ 2005లో ప్రారంభించారు. తీవ్ర మానసిక విభ్రమలకు కారణమయ్యే నార్కోటిక్ మొక్కలూ ఇందులో ఉన్నాయి. అత్యంత అందమైన పూలు, మొక్కలతో నిండి ఉండే ఈ ఉద్యానవనం చుట్టూ ఫెన్సింగ్‌తో ఎవరూ లోపలికి రాకుండా పకడ్బందీగా ఉంటుంది. ఇందులోని కొన్ని రకాల మొక్కలను ముట్టుకుంటే విషపూరితం కావాల్సిందే. అలాగే మరికొన్నింటి పూలు, మొక్కలను వాసన చూసినా ప్రాణాలు పోవడం ఖాయం. ఈ మొక్కల్లో జియాంట్ హాగ్ వీడ్ అనే మొక్క ఆకులను ముట్టు కుంటే చేతులపై చర్మం అప్పటికప్పుడు కమిలి పోయి ఊడిపోతుంది. ఆరేడు ఏళ్ల వరకూ వాటి తాలూకా మచ్చలు కూడా పోవు. అలాగే లారెల్ అనే మొక్క నుండి సైనైడ్ ఉత్పత్తి అవుతుంది. ఈ మొక్కను టచ్ చేస్తే కొద్ది సెకన్లలోనే ప్రాణాలు తీసే యగల రసాయనం అంటుకుంటుంది. ఇక బ్లూమాంక్స్ హు డ్ మొక్కల పూల నుండి ఆకులు, కాండం, పండ్ల వరకూ అన్నీ విషపూరితమే. దాని వాసన చూసి నా స్పృహ కోల్పోయిమెదడు మొద్దుబారిపో తుంది.

**సిహెచ్‌వివి రఘుబాబు**

# వయ్యారి భామ

వయ్యారి భామ అనే అందమైన పేరు కలిగిన ఈ మొక్క ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర కలుపు మొక్కగా పరిగణించబడుతోంది. అత్యంత సులభంగా వ్యాపించే ఈ మొక్క అతి త్వరగా ఏపుగా పెరిగే పంట పొలాలను నిర్వీర్యం చేస్తుంది. దీంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా ప్రజలు, పశువుల ఆరోగ్యంపై కూడా అధికమైన దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ వయ్యారి భామ మొక్క ప్రస్థానం తొలుత అమెరికాలోని ఉష్ణ ప్రాంతంలో మొదలైంది. నెమ్మదిగా ఇది ఆస్ట్రేలియా, ఆఫ్రికా తదితర దేశాలకు విస్తరించింది. 1956 సంవత్సరంలో ఆహార ధాన్యాలతో పాటుగా ఈ వయ్యారి భామ మన దేశం చేరింది. ఈ నేపథ్యంలో మొదటి సారిగా 1973 సంవత్సరంలో ఈ మొక్కను మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో గుర్తించారు. ఈ మొక్క అత్యంత ప్రమాదకర కలుపుమొక్క. ఇది మొలిచిన చోట పంట పైరుల ఎదుగుదలను కుంటుపరుస్తుంది. అందువల్ల దిగుబడి తగ్గుతుంది. పత్తి, మొక్కజొన్న, గోధుమ,



మల్బరీ తోటలు, పూల తోటలు, మామిడి, కూరగాయల తోటల్లో ఎక్కువగా పెరుగుతాయి. పంటలకు వేసిన ఎరువుల సారాన్ని కూడా పీల్చేస్తుంది. 40 శాతం వరకూ పంట దిగుబడిని తగ్గించే గుణం దీనికి ఉంది. ఈ మొక్క స్రవించే కొన్ని రకాల రసాయనాల వల్ల పంటల పెరుగుదల నశించిపోతుంది. దీని పుష్పాల నుండి వచ్చే పుప్పొడి రేణువులు ఇతర మొక్కలపై పడి పిందెలు, పూలు, కాయలు రాలిపోతాయి. అంతేకాకుండా కొన్ని రకాల వైరస్ తెగుళ్లు వ్యాపిస్తాయి. పక్వానికి వచ్చిన వయ్యారి భామ విత్తనాలు అతి చిన్నవిగా ఉంటాయి. ఇవి గాలి ద్వారా సుమారు 3 కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించి అక్కడ మొలకెత్తుతాయి. మొక్కలకే కాకుండా వయ్యారి భామ వల్ల మనుషులకు ప్రమాదకరమైన ఎగ్జిమా, హై ఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటిస్ మొదలైన వ్యాధులు వస్తాయి.

ఈ మొక్క ఆకులు చర్మానికి తగిలితే తామర వస్తుంది. పూల పుప్పొడిని పీలిస్తే జలుబు, కళ్ల ఎర్రబడటం, కను రెప్పలు వాపు, శ్వాస, చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి. దురదలు, తుమ్ములు వచ్చి చర్మంపై మచ్చలు ఏర్పడతాయి. అలాగే వయ్యారి భామ స్పర్శ వల్ల జంతువులకు వెంట్రుకలు ఊడిపోవడం, హై పవర్ టెన్షన్ పెరుగుతుంది. సాధారణంగా ఈ మొక్కను పశువులు తినవు. పొరబాటున గడ్డితో పాటు పశువులు వయ్యారి భామను తింటే ఆ పశువుల పాలు తాగిన మనుషుల జ్ఞాపక శక్తి దెబ్బతింటుంది. ఈ మొక్క పార్థనీయం, హైస్టరీన్, హైమోనిస్, ఎంబ్రోసిన్ అనే ప్రాణాంతకమైన రసాయనాలను విడుదల చేస్తాయి. ముఖ్యంగా వీటిని తిన్న పశువుల జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, అన్నవాహిక, శ్వాసక్రియలు దెబ్బతిని చివరకు మృత్యువాత పడతాయి.

# అమాయకపు చూపులు..



ఊహలన్నీ కొండెక్కి కూర్చొని
గాలితో గుసగుసలాడుతున్నాయి.
మనసులో నిండిన దుఃఖమంతా/ మోసం చేసిన మనుషులను
మదిలో నింపుకొని తూకం వేస్తున్నాయి.
కళ్లన్నీ అమాయకపు చూపులను
చూస్తూ కాలాన్ని నిలదీస్తున్నాయి.
జ్ఞాపకాలన్నీ హృదయపు గదిలోని అల్మారాలో
నిండుకొని భద్రంగా తాళం వేసుకున్నాయి.
ఆశలన్నీ మంచు తెరల్లా కళ్లముందు
తడిమిచూస్తే అంతా మాయే.
నిద్రిస్తున్న కళ్లలో కలలన్నీ సంతోషాల
పూలై పూస్తున్నాయి./ మెలుకువ వచ్చిన వేళ అదో
భ్రమ./ ఏకాంతాన కూర్చొని ఉన్న చోట
ఏవో కొన్ని ప్రేమ / పలుకుల చప్పుళ్లు.
చెవినిండా విందామంటే అంతా నిశ్శబ్దం.
గమ్యందారిలో
పయనిస్తూ ఉంటే
ప్రమిదల కాంతులన్నీ కనిపిస్తూ ఉన్నా
ఎదలో మాత్రం చీకటి మేఘాలు.
ఎన్నో బతుకులు ఒంటరి తీగల మీద..
తలకిందులై వేలాడుతున్నాయి.
రెక్కలు తెగిపడిన పక్షులన్నీ గాయాల గానాన్ని
ఆలపిస్తూ బతుకువేటని సాగిస్తున్నాయి.
అమాయకపు చూపులను చూస్తూ
మంచి మనసులు అనే చెట్టుకు పూసే
మానవత్వపు మనుషుల పలకరింపు
కోసం ఎదురు చూస్తున్నాయి.

**- అశోక్ గోనె**

---

## ఆమె

ఆమె దాగేకొద్దీ
ఆ పరిచయానికి రుచెక్కువ.
గొంతు దూరమయ్యేకొద్దీ
ఆ మాటలకు మత్తు ఎక్కువ.
ఆమెలో మునిగేకొద్దీ
ఆ లోతుకు దాహమెక్కువ.
కాలం గడిచేకొద్దీ/ ఆ జ్ఞాపకాలకు
జీవమెక్కువ./ ఆమెను
చెప్పుకునేటప్పుడు/ మనసుకు
వేగమెక్కువ/ తప్పుకుపోయేటప్పుడు
ఆ బంధానికి భారమెక్కువ.
ఆమెకు పంచేటపుడు/ భావాలకు
బాధ్యతెక్కువ./ పక్కనే ఉన్నప్పుడు/ఆ
రోజంతా తీపెక్కువ./ఆమెను /
వాసుకునేటప్పుడు/ కవితకు
ఊహలెక్కువ./ స్పందించినప్పుడు
నా మనసులో సందడెక్కువ.
ఆమెను తలచుకునేటప్పుడు
కాలానికి పరుగెక్కువ.
ఎదుటకొచ్చినప్పుడు
ఏదీ గుర్తుకురాని మరుపెక్కువ.

**- శ్రీసాహితి**

## భవిష్యత్తు చిత్రం

భవిష్యత్ పునాదులు
లేత పసిడి నవ్వుల చిన్నారులు
కల్లాకపటం ఎరగని
సోయగాలు/ కోటి
నక్షత్రాల వెలుగురేఖలు/
చందమామకు ప్రియమైన
నేస్తాలు/ ఆటైనా పాటైనా/
మాటైనా మరేదైనా
చైతన్యమై చెలరేగే చిన్నారి
చిరుతలు
ప్రేమతో నేర్పిస్తే ఇట్టే నేర్చేస్తారు
దండనతో బెదిరిస్తే
నక్కి నక్కి గుక్కపట్టి ఏడ్చేస్తారు
మెచ్చుకోలే ఆభరణం
నొచ్చుకోలు ఆటంకం
తుంచాలి వారిలో చెడుతనం
పెంచాలి వారిలో మానవత్వం
దూరంగుంచాలి వ్యసనాలకు
దగ్గర చేయాలి మంచి అలవాట్లు
నేర్పించాలి నేర్పుతో / పరులను
గౌరవించడం/
గమనించాలి
ఓర్పుతో



భవిష్యత్తు చిత్రం/ వారేకదా ధరణిని
నడిపే నవ నాయకత్వం

**- సి.శేఖర్ (సియస్సార్)**



## హాస్యం, చతురత మేళవించిన కథలు


శ్వాసించినంత తేలికగా, అలవోకగా చిన్నకథలు వ్రాయగలగటం ఆర్.సి.కృష్ణస్వామిరాజుకు వెన్నతో పెట్టిన విద్య. పకోడీపొట్లాలు, మిక్చర్ పొట్లాలు అన్నం కంటే రుచిగా ఉంటాయి. చతురత హాస్యం మేళవించిన ఈ పొట్టికథల్లో ఎక్కడా కృత్రిమత, నేలవిడిచిన సాము చేయకపోవటం వల్ల ఆ 'రుచి' వస్తుందనుకుంటాను. పాఠకులకు అలా గిలిగింతలు, చక్కిలిగింతలు పెడుతూ తిరుపతి పరిసర ప్రాంతాల్ని పరిచయం చేసారు రాజు. 30 కథలున్న ఈ 'మిక్చర్ పొట్లం'లో దాదాపు అన్ని కథలు మనకు ఎన్నో అనుభవాలను తెలియజేస్తాయి. రోజూ ఎదుర్కొనే నిత్య జీవిత సత్యాలను హాస్యరసం మేళవించి పంచుతున్నారు రచయిత.

ఇన్స్యూరెంటు ఏజంటు వీరాస్వామి (పొట్టి మొగుడు కథ) చేసే ఓవర్ యాక్షన్‌కు, రాజారెడ్డి కుక్కపిల్ల సెలెక్షన్‌కు వివరించిన క్వాలిఫికేషన్స్ (ముదురు) చివరాకరున పరమేశ్వర మంగళం పార్వతి ఎలా బలి అయిందో, ఒక మాసపత్రికకు పంపాల్సిన కథకు మునిరత్నం లీలారాణి దంపతులు ఎలా 'ట్రిమ్మింగ్' చేస్తారో (ట్రిమ్మింగ్ కథ) చదివిన పాఠకులకు నవ్వు ఆగదు.

హాస్యం, చతురత, పూలను గుచ్చేదారంలా కనబడీ కనబడకుండా, కథతోపాటు ప్రవహిస్తూ కితకితలు పెట్టే కథలివి. 'నేటివిటీ'ని దట్టించి మంచి కథలు రాస్తోన్న రాజుకు అభినందనలు. తప్పక చదవవలసిన కథలు.

**(మిక్చర్ పొట్లం, రచన: ఆర్.సి.కృష్ణస్వామిరాజు, వెల: రూ 125, ప్రతులకు: 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్, తిరుపతి-517501)** **- కూర చిదంబరం**

## ఆలోచింపచేసే స్వాతి రచనలు



'కలల తీగల మీద కదిలే రాగదీపం కదా జీవితం' 'స్వాతి' కవితలు, సున్నితభావాల వాక్చిత్రాలుగా, లోలోతుల ఆలోచనలతో ప్రకృతిని పలకరిస్తూ స్వాప్నికంగా నడుస్తుంటాయి. సిరికోన పురస్కృత సమర్పణ 'ఇక్కడ ఎవరైనా ఒకటే'తో 70 కవితలున్నాయి. స్వాతీశ్రీపాద, 'రేపటి కల' కవితలో 'తీగలు లేని పలుకుల మీద కాస్తున్న పందెపు జీవితాలు' ఈనాటి కథగా ఊహిస్తారు. 'కొంచెం మారి' కవితలో గుండెల నిండా ఆవరించిన మంచి తనం సుగంధాన్ని రాత్రంతా స్వప్నిస్తూ ఉదయాలను ఆహ్వానించమని, సూచిస్తూ, మన ఇద్దరినీ పలకరించే ఋతువులన్నీ అవే కదా. ఇద్దరినీ ఉతికి ఆరేసే కల్లోలాలు కరోనాలు, కల్మషాలు, క్లైషలూ అన్నీ ఒకటే కదా, 'ఇక్కడ ఎవరైనా ఒకటే' అంటూ పులితోళ్ల ముసుగులు, అమావాస్య జీవితాలు ఒకరితో ఒకరు కనిపించే అద్దాలే అంటారు. 'ఇక్కడ ఆత్మలకు, దేహాలు ఒట్టి అలంకారమే' అంటూ తాత్త్వికంగా ఋణానుబంధ రూపేణా అంటూ కొత్త అనుభూతుల దారులలోకి ఆలో చింపచేస్తారు. స్పందించే మనసుల్లో అపురూపంగా అల్లుకొనే కవిత్వం ఎప్పుడు ఎక్కడా సజీవమే కదా! అంటారు. ఈ తరం ఉత్తమ కవయిత్రి స్వాతి ప్రతీ కవిత వాస్తవ, అధివాస్తవికల ప్రకృతిక అవ్యక్త సౌందర్యాన్ని సున్నితంగా అన్వేషించే అద్భుత కళాత్మకాలు. హృదయాలలో అభిషిక్తమయితేనే ప్రతీకవిత స్వాతిముత్యపు చినుకులను ఆవిష్కరించగలదు. కవిత్వం రాస్తున్నామనుకొనే కవులను, రసహృదయులను ఈ సంపుటి ఆలోచింపచేస్తుంది.

**(ఇక్కడ ఎవరైనా ఒకటే, రచన: స్వాతీశ్రీపాద, 16/2/70/డి/2, మలక్‌పేట్, హైదరాబాద్)** **- జయసూర్య**

## పుస్తక సమీక్ష

పాత్రికేయ కవి, కథకుడు చలపాక ప్రకాష్ 'నా జీవనయాత్ర' పేరిట ఓ చిరుదీర్ఘ కవితను అందించాడు. ఈ చిన్నపొత్తంలో పుటలు తన బాల్యం నుండి యిప్పటివరకు సాగిన సాహితీయాత్రకు, మరో 33 పుటలు వివిధ సందర్భాల్లో, సాహితీ సమావేశాల్లో తను పాల్గొన్న ఫోటోలకు కేటాయించాడు. యిన్ని ఫోటోలు ఎందుకంటే

## అమెరికా సాహిత్యపుటంచుల దాకా..



బడాయికి కాదు..తాను అభివృద్ధి చేసుకున్న మానవ సంబంధాలను సమాజానికి చెప్పడం కోసం. 'యాత్రంటే..సమస్త ప్రకృతిని పలకరించి, తడిమి, తురుముకు రావడం!/ అనేక పాత్రలను కల గలుపుకొని కొంగ్రొత్త పాఠాలను నేర్చుకుంటూ సాగిపోవడం!!' అంటున్న ప్రకాష్‌కి మధ్యతరగతి కుటుంబ నేపథ్యం. తన బాల్యంలో యితర స్కూల్ పిల్లలతో కలిసి విజ్ఞానయాత్రకు రెండు రూపాయలు ఖర్చుపెట్టలేని కుటుంబ పరిస్థితులు. మరో సందర్భంలో స్కూల్ పరీక్షల కారణంగా కుటుంబ సభ్యులతో కలిసి చేయాల్సిన యాత్ర ఓ కలగానే మిగిలిపోయింది. తదనంతరం కవిగా, రచయితగా, నిత్య సాహిత్య కృషీవలుడిగా తనను తాను నిర్మించుకుంటూ సాగించిన సాహితీ యాత్ర ఉభయ తెలుగురాష్ట్రాలను దాటి 'అమెరికా సాహిత్య పుటంచుల్ని తాకి వచ్చిందంటే' ఆశ్చర్యం వేయకమానదు. 'నా వృత్తి జీవనమేకాదు/నా ప్రవృత్తి జీవితం కూడా'అంటున్నాడు ప్రకాష్. చలపాక ప్రకాష్ 'సాహితీ జీవన యాత్ర' యువతరానికి స్ఫూర్తిదాయకం అనడంలో అతిశయోక్తి లేదు.

**(నా జీవన యాత్ర, రచన: చలపాక ప్రకాష్, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లికేషన్, చుట్టుగుంట, విజయవాడ)** - రమణ వెలమకన్ని

విశాలాక్షి, వెంకటరావులకు అంకితం చేసారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు ఈ పుస్తకం ప్రచురించారు. వంగూరి చిట్టెన్‌రాజు, కె.మల్లికేశ్వరరావు, సరసిజ కృష్ణమూర్తి, సీతంరాజు స్వర్ణలతలు ముందు మాటలు రాశారు. దాదాపు 30 వ్యాసాల సంపుటి ఇది. విద్యార్థులకు,యువతకు చక్కటి కరదీపిక

## 'అవి ప్రభాత సాహితీజ్ఞాన వీచికలు'



ఇది. ప్రఖ్యాత భారత విజ్ఞాన శాస్త్రవేత్తలు, ప్రఖ్యాత భారత గణితశాస్త్రజ్ఞులు, నోబెల్ బహుమతులు, కోహినూర్ వజ్రం చరిత్ర, తెలుగు జానపద కళారూపాలు, రూపాయి చరిత్ర గురజాడ అప్పారావు, బ్రౌన్, బౌద్ధమతం, అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, 'సృష్టి' వ్యాసాలు ఎంతో ప్రయోజనకరమైనవి, ప్రమాణీకమైనవి. 400 కోట్ల సంవత్సరాల తరువాత నేలమీద పెద్ద వృక్షాలు పుట్టుకొచ్చాయి. ఆదిమానవుడు వానరజాతి నుంచి పరిణామం చెంది నాలుగు మిలియన్ల సంవత్సరాలక్రితం, భూమి మీద నివసిస్తున్న జీవరాశుల్లో ఆధిక్యత సంపాదించడం కోసం రక్షణ కోసం రాళ్లని ఆయుధాలుగా ఉపయోగించారు (పేజి.17) అంటారు సృష్టివ్యాసంలో. మొదటి దేవాలయం క్రీ.పూ.797-497 సం॥ మధ్య కట్టారంట? (పేజి.32) హిందూమతం సింధు లోయ నాగరికత కాలం నుండి క్రీ.పూ.3000 క్రీ.పూ 1500 సంవత్సరాల మధ్య క్రమంగా విస్తరించింది. ప్రతి ఇంట ఉండదగిన మంచి విలువైన గ్రంథం. **(ప్రభాతవీచికలు, రచన: డా॥ దూర్వాసులమూర్తి, వెల: రూ100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

# పూల పండుగ 'సద్దుల బతుకమ్మ'



బతుకమ్మ' పండుగను తెలంగాణ రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ. తెలంగాణ ఆడపడుచులంతా సంబరంగా జరుపుకునే వేడుక ఇది. బంధాలను, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగ బతుకమ్మ పండుగ. ఇదో పూల పండుగ. ప్రకృతిని పూజించే పండుగ. తొమ్మిది రోజుల పాటు ఆడి పాడి గౌరీ దేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే తెలంగాణకే ప్రత్యేకమైన పూల సంబరం బతుకమ్మ పండుగ.

## తొమ్మిది రోజుల ఉత్సవం

మహాలయ అమావాస్యనాడు 'ఎంగిలిపూల బతుకమ్మ'గా ప్రారంభమయ్యే సంబరాలు తొమ్మిది రోజుల పాటు సాగి 'సద్దుల బతుకమ్మ' రోజు గౌరమ్మను సాగనంపడంతో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వు ఏరికోరి తెచ్చి, రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రతిరోజూ గౌరీదేవిని తమ ఆట పాటలతో పూజిస్తారు. అందరూ కలిసి సంతోషంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడతారు. ఒకరు పాట చెప్తే మిగతా వారంతా ఆ పాటను తిరిగి పాడతారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. మహాలయ అమావాస్య రోజు చేసే బతుకమ్మ చిన్న బతుకమ్మ అంటారు.

## బతుకమ్మ పూల ప్రత్యేకతలు

బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఉపయోగించే పూలకు సైతం ఒక ప్రత్యేకత ఉంది. బతుకమ్మలు పేర్చడంలో ఉపయోగించే ప్రతి పువ్వులో ఔషధ గుణాలున్నాయి. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, కట్ల, సంపెంగ, మల్లె, సీతమ్మవారిజడ, రుద్రాక్ష, పోకబంతి, మందారం, మరువం, పారిజాతం, కమలం, తామర, గన్నేరు, గుమ్మడి, గులాబీ మొదలైన పూలతో చక్కగా బతుకమ్మలను పేరుస్తారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా మహిళలు చక్కగా ముస్తాబై అత్యంత భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బతుకమ్మలను మొదట ఇంటి ముంగిట్లో, ఆ తరువాత ఆలయాలలో అందరూ గుంపుగా కూడి సంబరాలు జరుపుకుంటారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సంబరాలలో పాలు పంచుకుంటారు. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేలా జానపదాలను పాడుతూ ఈ పండుగ జరుపుకుంటారు.

## తొమ్మిది రకాల నైవేద్యాలు

మొదటి రోజు 'ఎంగిపూల బతుకమ్మ' అత్యంత భక్తి శ్రద్ధలతో పేర్చి బతుకమ్మలను పూజిస్తారు. అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి ప్రసాదం తయారు చేస్తారు. రెండవ రోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినాడు 'అటుకుల బతుకమ్మ'ను జరుపుకుంటారు. అటుకులు, పప్పు, బెల్లంతో నైవేద్యం తయారుచేసి అమ్మవారికి నివేదిస్తారు. మూడవ రోజు 'ముద్ద పప్పు బతుకమ్మ'తో మహిళలు సంబరాలు చేసుకుంటారు. ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి గౌరీదేవికి సమర్పిస్తారు. నాలుగవ రోజు 'నానబియ్యం బతుకమ్మ'ను జరుపుకుంటారు. నానబెట్టిన బియ్యం, బెల్లం, పాలు కలిపి నైవేద్యం తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు. ఇక ఐదవ రోజు 'అట్ల బతుకమ్మ'ను జరుపుకుంటారు. ఆరోజు అమ్మవారికి నైవేద్యంగా అట్లను, దోసెలను పెట్టి పూజిస్తారు. ఆరవ రోజు బతుకమ్మను జరుపుకోరు. ఆరోజు 'అలిగిన బతుకమ్మ' పేరుతో సంబరాలకు దూరంగా ఉంటారు.

మళ్లీ ఏడవ రోజు 'వేప కాయల బతుకమ్మ'తో వేడుక చేసుకుంటారు. వేప పండ్లలా బియ్యం పిండిని చుట్టి, వాటిని బాగా వేయించి, వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. ఎనిమిదవ రోజు 'వెన్నముద్దల బతుకమ్మ'తో సంబరాలు

**(మిగతా 19వ పేజీలో)**

# బతుకమ్మను పేర్చే పాట

తొమ్మిది రోజులు ఉయ్యాలో
నమ్మికా తోడుత ఉయ్యాలో
అలరి గుమ్మడి పూలు ఉయ్యాలో
అరుగులూ వేయించిరి ఉయ్యాలో
గోరంట పూలతో ఉయ్యాలో
గోడలు కట్టించి ఉయ్యాలో
తామరపూలతో ఉయ్యాలో
ద్వారాలు వేయించి ఉయ్యాలో
మొగిలిపూలతోని ఉయ్యాలో
మొగరాలు వేయించి ఉయ్యాలో
వాయిలీ పూలతో ఉయ్యాలో
వాసాలు వేయించి ఉయ్యాలో
పొన్నపూలతోటి ఉయ్యాలో
యిల్లునూ కప్పించి ఉయ్యాలో
దోసపూలతోని ఉయ్యాలో
తోరణాలు కట్టించి ఉయ్యాలో
పసుపుముద్దను చేసి ఉయ్యాలో
గౌరమ్మను నిలిపిరి ఉయ్యాలో
చేమంతి పూలతోని ఉయ్యాలో
చెలియను పూజించిరి
ఉయ్యాలో
సుందరాంగులెల్ల ఉయ్యాలో
సుట్టూత తిరిగిరి ఉయ్యాలో
ఆటలు ఆడిరి ఉయ్యాలో
పాటలు పాడిరి ఉయ్యాలో
గౌరమ్మ వరమిచ్చె ఉయ్యాలో
కాంతలందరికి ఉయ్యాలో
పాడిన వారికి ఉయ్యాలో
పాడిపంటలు కల్గు ఉయ్యాలో
ఆడినవారికి ఉయ్యాలో
ఆరోగ్యము కల్గు ఉయ్యాలో
విన్నావారికి ఉయ్యాలో
విష్ణుపదము కల్గు ఉయ్యాలో

...

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
ఆనాటి కాలాన ఉయ్యాలో
ధర్మాంగుడను రాజు ఉయ్యాలో
ఆ రాజు భార్యయు ఉయ్యాలో
అతి సత్యవతి యంద్రు ఉయ్యాలో
నూరు నోములు నోమి ఉయ్యాలో
నూరు మందిని కాంచె ఉయ్యాలో
వారు శూరులై ఉయ్యాలో
వైరులచే హతమయిరి ఉయ్యాలో
తల్లిదండ్రులప్పుడు ఉయ్యాలో
తరగని శోకమున ఉయ్యాలో
ధన రాజ్యములను బాసి ఉయ్యాలో
దాయాదులను బాసి ఉయ్యాలో
వనితతో ఆ రాజు ఉయ్యాలో
వనమందు నివసించె ఉయ్యాలో
కలికి లక్ష్మిని గూర్చి ఉయ్యాలో
ఘన తపంబొనరించె ఉయ్యాలో
ప్రత్యక్షమై లక్ష్మి ఉయ్యాలో
పలికె వరమడుగమని ఉయ్యాలో
వినిపించి వేడుచూ ఉయ్యాలో
వెలది తన గర్భమున ఉయ్యాలో
పుట్టమని వేడగా ఉయ్యాలో
పూబోణి మది మెచ్చి ఉయ్యాలో
సత్యవతి గర్భమున ఉయ్యాలో
జన్మించె శ్రీలక్ష్మి ఉయ్యాలో
అంతలో మునులును ఉయ్యాలో
అక్కడికి వచ్చిరి ఉయ్యాలో
కపిల గాలవులు ఉయ్యాలో
కశ్యపాంగ ఋషులు ఉయ్యాలో
అత్రి వశిష్టులు ఉయ్యాలో
ఆ కన్నియను చూసి ఉయ్యాలో
బతుకనీయ తల్లి ఉయ్యాలో
బతుకమ్మ యనిరంత ఉయ్యాలో



పిలువగా అతివలు ఉయ్యాలో
ప్రేమగా తల్లిదండ్రులు ఉయ్యాలో
బతుకమ్మ యను పేరు ఉయ్యాలో
ప్రజలంత అందురు ఉయ్యాలో
తాను ధన్యుడంటూ ఉయ్యాలో
తన బిడ్డతో రాజు ఉయ్యాలో
నిజ పట్నముకేగె ఉయ్యాలో
నేల పాలించగా ఉయ్యాలో
శ్రీమహివిష్ణుండు ఉయ్యాలో
చక్రకుండను పేర ఉయ్యాలో
రాజు వేషమ్మున ఉయ్యాలో
రాజు ఇంటికి వచ్చి ఉయ్యాలో
ఈ ఇంట మునియుండి ఉయ్యాలో
అతిగా బతుకమ్మను
ఉయ్యాలో
పెండ్లాడి కొడుకుల
ఉయ్యాలో
పెక్కు మందిని కాంచె
ఉయ్యాలో
ఆరు వేల మంది ఉయ్యాలో
అతి సుందరాంగులు
ఉయ్యాలో



ధర్మాంగుడను రాజు ఉయ్యాలో
తన భార్య సత్యవతి ఉయ్యాలో
సిరిలేని సిరులతో ఉయ్యాలో
సంతోషమొందిరి ఉయ్యాలో
జగతిపై బతుకమ్మ ఉయ్యాలో
శాశ్వతమ్ముగ వెలిసే ఉయ్యాలో
ఈ పాట పాడినను ఉయ్యాలో
ఈ పాట విన్నను ఉయ్యాలో
సౌభాగ్యములనిచ్చు ఉయ్యాలో
శ్రీగౌరీదేవి ఉయ్యాలో
సిరి సంపదలిచ్చు ఉయ్యాలో
శ్రీలక్ష్మీదేవి ఉఆయ్యలో
ఘనమైన కీర్తిని ఉయ్యాలో
శ్రీవాణి ఒసగును ఉయ్యాలో
ఘనమైన కీర్తిని ఉయ్యాలో
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో

...

## శ్రీలక్ష్మి నీ మహిమలు

శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మ
॥2॥
భారతీదేవివై బ్రహ్మకిల్లాలివై
పార్వతీ దేవివై పరమేశు రాణివై
పరగ శ్రీలక్ష్మివైయ్యూ గౌరమ్మ
భార్య వైతివి హరికినీ గౌరమ్మ
శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మ
ముక్కోటి దేవతుల సక్కనీ కాంతలు
ఎక్కువగ నిను గొల్చి పెక్కు నోములు
నోచి
ఎక్కువా వారయ్యిరీ గౌరమ్మ
ఈ లోకమున నుండియూ గౌరమ్మ
శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ
చిత్రమై తోచునమ్మా గౌరమ్మ ◆







కథ

# పక్షుల విలాపం

పచ్చని అడవిలో ఒక చెట్టుపై వసంతపు చిగురులు తిని కమ్మని రాగంతో కోయిల కుహూ కుహూ గానంలో గొంతెత్తి వినిపిస్తోంది. అంతలో ఒక కాకి ఆయాసపడుతూ ఆ చెట్టు దగ్గరికి వచ్చి వాలింది.

కాకిని చూసిన కోయిల "ఏమండీ, కాకిగారూ! ఎక్కడి నుండి రాక? ఆయాసపడుతూ వస్తున్నారు.. ఏంటి సంగతి?" అని అడిగింది.

కాకి బాధపడుతూ "ఏమి చెప్పమంటావు నా బాధ? అక్కడ యుద్ధం జరుగుతోంది, చనిపోయేవాళ్లు ఎక్కువయ్యారు. వాళ్ల పిండాలు తిని తిని కడుపు ఉబ్బరం అయింది. యుద్ధం ఎప్పుడు ఆపుతారో, అప్పటివరకు ఈ పిండాల బాధ నాకు తప్పేటట్లు లేదు" అని కోకిలతో మొరపెట్టుకుంది కాకి.



కోకిల ఆకాశంలోకి చూస్తూ "అదిగో! పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లు అరుచుకుంటూ పిచ్చుక వస్తుంది చూడు" అని చెప్పింది.

అంతలో కన్నీరు కారుస్తూ పిచ్చిక ఆకాశంలో రివ్వున తిరుగుతూ అదే చెట్టు పైకి వచ్చి కాకి-కోకిల మధ్య వాలి కూర్చుంది.

కోయిల "నేస్తమా! కుశలమా?" అని అడిగింది.

"ఏమి నేస్తమో ఏమో! మా బాధ భగవంతుడికి ఎరుక. మా జాతి అంతా మెల్లగా పోతోంది. మానవులు వాడే టెక్నాలజీ రేడియేషన్ వల్ల మా జాతి కనుమరుగైపోతోంది. చిన్న ప్రాణులం మేమంత? మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు. రోజు రోజుకు రేడియేషన్ పెరిగిపోతున్నది. ఆ మధ్య మా కోసం సినిమా కూడా తీశారు. రోబో 2.0 సినిమా చూశారు కానీ ఎవరూ పట్టించుకోలేదు" అని పిచ్చుక వాపోయింది.

అంతలో గిరగిరా తిరుగుతూ ఒక తెల్ల పావురం రక్తపు మరకలతో వచ్చి ముగ్గురి మధ్య వాలింది. కోయిల "ఏమి మిత్రమా! ఒంటినిండా ఆ రక్తపు మరకలు?" అని అడిగింది.

"ఏమి చెప్పను నేస్తం! శాంతి కాములకమంటూ ఒక దిక్కు యుద్ధాలు చేస్తూ చేతులకు తాకిన రక్తపు మరకలతో మమ్మల్ని శాంతి కోసం ఆకాశంలో ఎగరేస్తున్నారు. పేరుకు శాంతిలోన అశాంతి యుద్ధోన్మాదంతో రక్తంతో మమ్మల్ని శుద్ధి చేస్తున్నారు" అని తన బాధను చెప్పుకుంది.

"సరే మిత్రమా!" అంటూ కోయిలను చూశాయి అన్నీ.

కోయిల కంటిలో కన్నీరు కారుతోంది. ఆ కన్నీటి చుక్కలు కాలుష్య మరకలు అంటిన ఆకులపై పడుతున్నాయి. కోకిల వారితో "ఏమి చెప్పను మిత్రులారా! పచ్చని చిగుళ్ల తిని ఎన్నాళ్లయిందో! కాలుష్యం పెరిగి ఆకులన్నీ మసి అంటుకున్నాయి. అవి తిని కడుపురోగం వచ్చింది. ఎన్నాళ్లు బతుకుతానో తెలియదు" అని చెప్పింది.

"దీనికంతటికీ కారణం మనిషి చేస్తున్న వికృత చేష్టలు కారణమని అందరూ ముక్తకంఠంతో నినదించారు. మనమందరం కలిసి భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వేడుకుందాం. ఇంతకుమించి మనం ఏం చేయగలం? లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని గోడల మీద చిత్రాల్లో చూడాల్సి వస్తుంది. మానవులు మనకు మనుగడ లేదని గుర్తిస్తే ఇక మనకు నరకమే! అని నిర్ణయించుకొని నలుగురు నాలుగు దిక్కులు తిరిగి వనదేవతను ప్రార్థించడం మొదలుపెట్టారు. వనదేవత ప్రత్యక్షమైంది.. "దీనికంతటికీ మానవులు మూల్యం చెల్లించక తప్పదు. మానవుల్లో పరివర్తన అతి త్వరలో జరుగుతుంది. ఇప్పుడు వాళ్లే అపాయంలో ఉన్నారు. వాళ్లను వాళ్లే కాపాడుకొనే రోజులు కావాలి. మానవుడు కళ్లు తెరిచి నిజాన్ని గ్రహించి సరిదిద్దే ప్రయత్నం చేస్తాడు. త్వరలో మంచి రోజులొస్తాయి" అని దీవించి వెళ్లిపోయింది. పక్షులన్నీ ఆ రోజుల కోసం ఎదురు చూస్తూ అడవిలో ఆశతో తిరగసాగాయి.

**- కొప్పుల ప్రసాదు**







# పసుల పాలపిట్ట
వార్త ఆదివారం

## బాలగేయం

### కోతిపిల్ల



పిల్లల్లారా రారండి
కోతిని చూదరారండి
చెట్టుమీద
కోతిపిల్ల
చకచకా తిరుగుతుంది
మా తాతయ్య జాపండు
కోతి కోసం
విసిరాడు
నోట కరచిన
కోతిపిల్ల
కొమ్మ కొమ్మకు
తిరుగుతుంది
కోతి మీదకు
మాచెల్లాయి
రాయిపిక్క విసిరింది
కోపంగా చూసుకుంటూ
కోతెళ్లిపోయింది

**- వైదా ఈశ్వరరావు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.సౌదామిని,** నాందేడ్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. టీవీని ఆపు చేసినప్పుడు స్క్రీన్ మీద లైన్‌ల తరహా గీతలు కనిపిస్తుంటాయి. ఎందుకు?**

**జవాబు: సౌదామిని!** టీవీ తెర మీద దృశ్యాల నాణ్యత, అందులోని అడ్డురేఖల సంఖ్య మీద ఆధారపడి ఉంటుంది. టీవీని స్విచాఫ్ చేసినప్పుడు తెర మీద కనిపించే లైన్‌లను పరిశీలించండి. ఈ అడ్డుగీతలు పెరిగేకొద్దీ బొమ్మ స్పష్టతతో మెరుగైన తీరు కనిపిస్తుంది. 1930లో టీవీ సృష్టికర్త జె.ఎల్.బేయర్డ్ ప్రదర్శించిన మెకానికల్ టీవీలో అతి తక్కువగా కేవలం 30 లైన్లు మాత్రమే ఉండటంతో ఆనాటి బొమ్మల నాణ్యత ఏమంత బాగుండేది కాదు. తర్వాతి కాలంలో 240 వరకు లైన్‌ల సంఖ్య పెంపొందించి చిత్రంలో నాణ్యతను తీసుకువచ్చారు. 1936లో ప్రపంచంలోనే తొలిసారిగా ఉత్తమ స్థాయి స్పష్టతతో (హై రెజల్యూషన్) కూడిన చిత్రాలను(దృశ్యాలను) 405 లైన్‌లతో అందిచండం గొప్ప విశేషం. కాలక్రమంలో ఈ లైన్ల సంఖ్య పెరుగుతూ రావడంతో స్క్రీన్ మీద బొమ్మలో స్పష్టత పెరిగింది.

**- ఎస్.వేదవతి,** నెల్లూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వలస పక్షులు ఎంత వేగంగా ప్రయాణిస్తాయి?**

**జవాబు: వేదవతి!** వలస పక్షుల్లో కొన్ని పగలు, కొన్ని రాత్రివేళ, మరికొన్ని రాత్రీ, పగలు కూడా ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. పెలికాన్‌లు, కొంగలు రెండు పూటలా ప్రయాణించే పక్షులు. నీటిపక్షులు, నీటి బాతులు, రోజీ పాస్టర్స్, గ్రీస్ మొదలైనవి రాత్రివేళ మాత్రమే ప్రయాణిస్తాయి. వలస పక్షులు సాధారణంగా 500 నుంచి 900 మీటర్ల ఎత్తులో 30 నుంచి 100 మీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. 6 నుంచి 11 గంటల పాటు ఏకబిగిన ఎగురుతాయి. ఆర్కిటిక్ బ్లాక్‌పోల్, స్లెండర్ బిల్ వంటి పక్షులు 240 నుంచి 970 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతాయి.



**బ్రిటిష్ వారి పాలన చెర నుండి భారతావని స్వేచ్ఛా వాయువులు పొందడానికి కృషి చేసిన మహానుభావులలో మొదటగా స్మరించదగినవారు మహాత్మాగాంధీ.**



సత్యం, అహింస సిద్ధాంతాలతో సామాన్య ప్రజల్లో కూడా జాతీయ భావాలను రేకెత్తించి బ్రిటిష్ వారి గుండెల్లో గుబులు పుట్టించిన దృఢచిత్తుడు ఆయన. బ్రిటిష్

# భావితరాలకు మార్గదర్శి మహాత్మా గాంధీ

పాలకుల నియంతృత్వ పాలనకు కళ్లెం వేసిన మహా మేధావి. వివేకం, వివేచనతో లక్ష్య సాధనలో విజయం సాధించిన ధీశాలి గాంధీజీ. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోరుబందర్‌లో పుత్లీబాయి, కరంచంద్ గాంధీ దంపతులకు జన్మించారు. గాంధీజీ పాఠశాల విద్యను రాజ్‌కోట్‌లో పూర్తి చేశాడు. తనకు 13 ఏళ్ల వయసులోనే కస్తూరిబాయితో వివాహం జరిగింది. చిన్నతనంలో తల్లి వద్ద విన్న పురాణేతిహాసాలు ఆయనపై తీవ్ర ప్రభావం చూపాయి. అవి ఆయన భావి జీవితానికి సన్మార్గాన్ని చూపాయి. నిర్మలమైన, నిరాడంబరమైన జీవనం గడిపాడు. ఉన్నత విద్యానంతరం ఇంగ్లాండ్ వెళ్లి బారిస్టర్ చదివి ఉత్తీర్ణులయ్యారు. లండన్‌లో చదువుకునే సమయంలో నిజాయితీ, స్వీయ క్రమశిక్షణ, నిగ్రహం, పవిత్రత, శాకాహారం అలవర్చుకున్నాడు. 1893లో న్యాయవాద వృత్తికై దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడ జాతి వివక్ష ఎక్కువగా ఉండేది. శ్వేత జాతీయులు నల్లజాతీయులను చాలా హీనంగా చూసేవారు. నల్ల జాతీయుడు అనే



కారణంతో గాంధీజీని మొదటి తరగతి రైలుపెట్టె నుండి దింపి అవమానించారు. ఇది తెల్లవారి జాత్యహంకారానికి ఒక ఉదాహరణ మాత్రమే. గాంధీజీ అక్కడి భారతీయుల దుస్థితిని చూసి చలించిపోయారు. దక్షిణాఫ్రికాలోని నల్ల జాతీయుల హక్కులకై పోరాడి వారిలో రాజకీయ, సామాజిక స్పృహ కల్పించి స్వాతంత్ర్యేచ్ఛకు పునాది వేశారు గాంధీ. 1914లో దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగివచ్చిన తర్వాత గాంధీజీ ఇక్కడి పరిస్థితులను గమనించి స్వాతంత్ర్యోద్యమ ఆవశ్యకతను గుర్తించారు. ఈ ఉద్యమంలో ఆయనకు అనేక మంది ప్రముఖులు అండగా నిలిచారు. చంపారన్ సత్యాగ్రహోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమం, సహాయ నిరాకరణోద్యమం, దండియాత్ర, శాసనోల్లంఘనోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైనవి గాంధీజీ నాయకత్వంలో విజయవంతంగా నిర్వహింపబడి భారతదేశ స్వాతంత్ర్య సాధనలో కీలకపాత్ర వహించాయి. స్వాతంత్రోద్యమంలో భాగంగా లాఠీ దెబ్బలు భరించి, అనేకమార్లు జైలుకు వెళ్లారు. అయినప్పటికీ తను నమ్ముకున్న అహింసనూ, సత్యాన్నీ వదిలిపెట్టలేదు. స్వాతంత్ర్య సమర సేనానిగా నాటి సమర యోధులందరినీ సమాయత్తం చేసి ఏకతాటిపై నడిపి ప్రజలచే జాతిపితగా నీరాజనాలు అందుకున్న మహనీయుడు మహాత్మాగాంధీ. స్వాతంత్రోద్యమంలో పాల్గొనడమే కాకుండా దేశాభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్న అనేక సమస్యలపై కూడా గాంధీజీ దృష్టి సారించారు.

దళితులను హరిజనులుగా భావించి అస్పృశ్యత నివారణ కోసం కృషి చేశారు. వయోజన విద్య, మద్యపాన నిషేధం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయదారుల అభ్యున్నతి వంటి అనేక నిర్మాణాత్మక కార్యక్రమాల్లో గాంధీజీ పాలుపంచుకున్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్, పాకిస్తాన్‌లుగా ఏర్పడి హిందు, ముస్లింల మధ్య చెలరేగిన అల్లర్లకు తీవ్రంగా కలత చెందాడు గాంధీజీ. ప్రజలంతా సమైక్యతతో జీవించాలని సత్యాగ్రహం చేసిన మహనీయుడు. దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషి చేసిన మహాత్మా గాంధీని 1948 జనవరి 30న గాడ్సే కాల్చి చంపాడు. గాంధీజీ స్మృతి చిహ్నంగా అతని స్మారక స్థలాన్ని రాజ్ ఘాట్‌లో ఏర్పాటు చేశారు.
గాంధీజీ స్థాపించిన సబర్మతీ ఆశ్రమం ఆయన ఆశయానికి ప్రతిరూపం. ఆశ్రమంలో తన పనిని తానే స్వయంగా చేసుకునేవాడు. తను చేసిన తప్పుల నుండి నేర్చుకోవడం, ఆయన సత్యంతో చేసిన ప్రయోగాలు సత్యశోధన(గాంధీ ఆత్మకథ)కు ఎంతగానో ఉపయోగపడ్డాయి. విద్య అనేది పనిని కల్పించే విధంగా ఉండాలని భావించారు. వృత్తి విద్యలను ప్రోత్సహించారు. గాంధీజీ ప్రతిపాదించిన ప్రాతిపదిక విద్య పలువురి మన్ననలు పొందింది. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని భావించి గ్రామ స్వరాజ్యం కోసం కలలు కన్నాడు.
రక్తం పారించకుండా సహాయ నిరాకరణ, సత్యాగ్రహం అనే ఆయుధాలతో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని మన దేశం నుండి పారదోలి భారతీయులందరికీ స్వేచ్ఛను ప్రసాదించి జాతిపితగా నిలిచారు.
గాంధీజీ ఔన్నత్యాన్ని ప్రస్తావిస్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ "ఇటువంటి ఒక వ్యక్తి నిజంగా మన మధ్య జీవించాడంటే రాబోయే తరాలవారు నమ్మలేరు" అని అన్నాడు. మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన గొప్ప మహనీయులలో గాంధీ ఒకరు. సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి మాటల్లో చెప్పాలంటే "భరతమాత తలరాతను మార్చిన విధాత గాంధీ". ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలను తన జీవిత కాలంలో చూసిన గాంధీజీ సత్యం, శాంతి, అహింసలను నమ్ముకొని ఆచరించి మానవాళి శ్రేయస్సుకు మార్గదర్శకులయ్యారు. అటువంటి మహనీయుని ఆశయ సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన బాధ్యత భారతీయులుగా మనం దరిపై ఉంది. గాంధీజీ పాటించిన విలువలు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**- కందుకూరి భాస్కర్**

## పూల పండుగ 'సద్దుల బతుకమ్మ'

(14 పేజీ తరువాయి)

జరుపుకుంటారు. ఎనిమిదవ రోజు వెన్న, నువ్వులు, బెల్లం కలిపి నైవేద్యంగా తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు. తొమ్మిదవ రోజు అత్యంత ముఖ్యమైన 'సద్దుల బతుకమ్మ'ను జరుపుకుంటారు. ఆశ్వయుజ అష్టమినాడు అంటే దుర్గాష్టమి రోజు అమ్మవారికి తొమ్మిది రకాల నైవేద్యాలు సమర్పిస్తారు.

### బతుకమ్మను పేర్చే విధానం

రాగి/ఇత్తడి పళ్లెంలో ముందుగా బీర/గుమ్మడి ఆకులను వేసి వాటిపై తంగేడు, గునుగు పూల కట్టలను పేర్చి మధ్య మధ్యలో ఇతర పూలను వినియోగిస్తూ బతుకమ్మను పేరుస్తారు. ముఖ్యంగా బతుకమ్మను పేర్చడానికి తంగేడు, గునుగు, కట్లపూలను ఎక్కువగా ఉపయోగిస్తారు. పువ్వులతో త్రికోణాకారంలో చక్కగా బతుకమ్మను పేర్చి దానిపై పసుపుతో చేసిన గౌరమ్మను పెడతారు. ఈ విధంగా తయారు చేసిన బతుకమ్మను దైవంగా పూజిస్తారు.



సాయంత్రం సమయంలో అందరూ తమ బతుకమ్మలను తీసుకుని, ఒక్కచోట చేరి ఆలయంలో తరువాత చెరువుదగ్గర ఆడి పాడి ఆపై బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా పెట్టిన ప్రసాదాలను మహిళలు ఒకరికొకరు పంచుకుంటారు. ఇస్తినమ్మ వాయనం.. పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ పళ్లెంలో తెచ్చిన నీళ్లతో వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఒక్కచోట చేరి ఆడి పాడి సంతోషంగా గడుపుతారు.



### బతుకమ్మ పాటలు

ఆచారాలు, సాంప్రదాయాలు, పద్ధతులు తెలిపేలా బతుకమ్మ పాటలను పాడతారు. బతుకమ్మ పాటలలో పురాణ, ఇతిహాస కథలు మొదలుకొని తెలంగాణ వీరుల కథలు, జానపద ఇతివృత్తాలు ఉంటాయి. ముఖ్యంగా బతుకమ్మ పాటల్లో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబిస్తుంది. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ పాడే పాటలు మొదలుకొని 'ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె చందమామ' లాంటి పాటలు శ్రావ్యంగా మహిళల గళం నుండి జాలువారతాయి. అందరూ కలిసికట్టుగా సమిష్టిగా జరుపుకునే అద్భుతమైన పండుగ ప్రపంచంలో బతుకమ్మ ఒక్కటే అని చెప్పటం తెలంగాణకే గర్వకారణం.

# గెలుపు-ఓటమి

కథ

**శ్యామకుమార్ చాగల్**

**ఊరికి** చివర ఉండే చెరువు గట్టు మీద కూర్చుని వుంది ఉమ.

పక్కన మెత్తటి పచ్చని గడ్డి మీద వెల్లకిలా పడుకుని ఆకాశం వైపు చూస్తున్నాడు చంద్రశేఖర్. మెల్లిగా లేచి జేబులో నుండి చిన్న ప్యాకెట్ తీసాడు. అందులో నుండి ఉంగరం తీసి "హ్యాపీ బర్త్‌డే" అని చెప్పి వేలికి తొడిగాడు చంద్రశేఖర్.


"ఈసారి నాకు నెక్లెస్ అన్నావుగా చంద్రం! ఏదీ?" అంది ఉమ చిలిపిగా నవ్వుతూ.

"ఇదిగో..! ఇప్పుడే వ్యాపారం కుదురుకుంటోంది.. ఫ్లాట్ తీసుకున్నా ఇప్పుడే. మిగతావి మన పెళ్లి అయ్యాక" అన్నాడు చంద్రం గడ్డిలో మళ్లీ వెనక్కి వొరిగి.

"ఎప్పుడు కలుస్తావు మా నాన్నగారిని" ప్రేమగా అడిగింది ఉమ.

"రేపే" అన్నాడు మళ్లీ చిరునవ్వుతో.

"ఇప్పటికే అయిదు సంవత్సరాలు దాటింది మనం కలిసి. డిగ్రీ నుండి నా పీజీ కూడా అయిపోయి రీసెర్చ్ పూర్తయిపోయింది" అంది ఉమ.



"రేపు సాయంకాలం కలుస్తాను. మీ నాన్నకు చూచాయగా ఒకసారి చెప్పటం మంచిది" అన్నాడు.

"మా నాన్నకు చెప్పటం అంత ఈజీ కాదు. సరే.. రేపు ఇంటికి వచ్చెయ్యి" అని లేచి నిలబడి చందుకి చెయ్యి అందించింది.

ఆ చెయ్యి పట్టుకుని లేచి నిలబడ్డాడు. చుట్టూ చూసాడు, చీకటి పడుతోంది. చెరువుపై నుండి పక్షులు ఎగిరిపోతున్నాయి.

స్కూటర్ కిక్ కొట్టి ఉమ కూర్చోగానే ముందుకు కదిలాడు.

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక టీవీ చూస్తూ కూర్చున్నారు ఉమ తల్లిదండ్రులు జగన్నాథం, సీత.

మెల్లిగా వచ్చి తండ్రి పక్కన సోఫాలో కూర్చొని "నాన్నా, రేపు మిమ్మల్ని కలవటానికి చంద్రశేఖర్‌ని రమ్మన్నాను" అంది తల కిందకు వంచుకుని.

పక్కకు తిరిగి కూతురి వూపు సీరియస్‌గా చూసాడు జగన్నాథం.

"నీకు న్యూరో సర్జన్, హార్ట్ స్పెషలిస్ట్, డాక్టర్సు లాంటి పెద్ద సంబంధాలు వస్తున్నాయి తెలుసుగా. నీ చదువుకి, మన అంతస్తుకి, నీకు తగిన అబ్బాయిని చేయడం నా విధి, బాధ్యత. అది గుర్తు పెట్టుకుంటే మంచిది. కులగోత్రాలు పట్టింపు గురించి కూడా నీకు తెలుసు. అవన్నీ బాగున్నప్పుడు నాకెలాంటి అభ్యంతరాలుండవు".

"అన్నీ వున్నాయి నాన్నా" అంది సంశయిస్తూ.

"మరేంటి ప్రాబ్లమ్ .. పైగా వాళ్ళ తల్లిదండ్రి రావాలిగానీ అబ్బాయి రావడం దేనికి?"

"ముందుగా మీకు నచ్చి, మీరే సరేనంటే" అంది మెల్లిగా.

"మంచిది.. సరే రమ్మను" అనే తిరిగి టీవీ వైపు దృష్టి సారించాడు సంభాషణ అయిపోయిందన్నట్లుగా.

తండ్రితో ఎక్కువ మాట్లాడటానికి భయం వేసి మరింకేమీ మాట్లాడకుండా లేచి తన గదిలోకి వెళ్లి మొబైల్ తీసుకుని చంద్రశేఖర్ నెంబర్ డయల్ చేసింది.

"హలో చంద్రం.. రేపు సాయంత్రం రావచ్చు, నాన్నగారు సరేనన్నారు"

"ప్రాబ్లం లేదుగా!" అడిగాడు చంద్రం ఆదుర్దాగా.

"లేదు.. కానీ రేపు ఉదయం మనం కలిసి మాట్లాడుకుంటే బాగుంటుంది. అదే ప్లేస్‌కు పది గంటలకు వచ్చేయ్"

"సరే"

"వుంటాను.. గుడ్ నైట్" అని ఫోన్ కట్ చేసింది ఉమ.

మరుసటి ఉదయం గుడి బయట మంటపం మెట్ల పైన కూర్చుని ఆలోచిస్తున్నారిద్దరు.

"మా నాన్న చాలా క్రమశిక్షణ కలిగిన మనిషి. ఆ విధానంలో మా అందరినీ పెంచారు. అన్నయ్యలు ఇద్దరూ మెడిసిన్ పూర్తి చేసినప్పటికీ ఇప్పుడు కూడా ఆయనకు ఎదురు చెప్పరు. ఎందుకంటే తన పద్ధతిలో ఎక్కడా పొరపాట్లు ఉండవు. కాబట్టి చాలా జాగ్రత్తగా డీల్ చేయాలి" అని చెప్పి చంద్రం వేపు చూసింది.

"నీకంటే నాకు చదువు తక్కువ, మరి ఎలా ఉంటుందో మీ నాన్నగారి..." అని ఆగాడు.

"నీ వ్యాపారం, కుటుంబం గురించి చెప్పు ముందు. తాను చాలా సిద్ధాంతాల మీద నడిచే వ్యక్తి. వాటికి చాలా ప్రాముఖ్యం ఇస్తారు" అంది.

"సరే.. మరి ఇక వెళ్దామా?"

ఇద్దరూ బరువెక్కిన మనసుతో ఇళ్లకు వెనుదిరిగారు.

...

చంద్రం ఇంట్లో ఉమ గురించి వివరంగా చెప్పసాగాడు చంద్రం.

అంతా విన్న తర్వాత నిర్మల నిట్టూర్చి "అసలు నువ్వెందుకు వెళ్లటం, ఆడపిల్ల తండ్రి ఆయన రావాలి.. అది పద్ధతి. ఎంత నీకిష్టమైనప్పటికీ నువ్వెళ్తే ఎలా ప్రవర్తిస్తారో ఏంటో" అంది ఆందోళనగా.

"పోనీ మీరెళ్తారా?" సందేహంగా అడిగాడు చంద్రం తల్లీ, తండ్రి వంక చూసి.

"లేదురా.. పిలవని పేరంటానికి వెళ్లకూడదన్నట్లుగా మేం వెళ్లటం సరికాదు. నేను ఉమ తండ్రి గురించి

కనుక్కున్నాను. కాస్త చాదస్తం. పైగా చాలా పొగరుగా ప్రవర్తిస్తాడని చెప్తున్నారు" ఈజీ చైర్లో వెనక్కి వాలి చేతిలో వున్న వక్కపలుకు నోట్లో వేసుకుని సమాధానం చెప్పాడు తండ్రి ఉపేంద్ర.

"అయితే నేనే వాళ్ల ఊరు వెళ్లి మొదట వారి ఉద్దేశం కనుక్కొని వస్తాను" అని లేచాడు చంద్రం.

"జాగ్రత్తగా వెళ్లిరా, రాత్రి తిరుగు ప్రయాణం స్కూటర్‌పైన జాగ్రత్త" అన్నాడు ఉపేంద్ర.

తండ్రి కళ్లల్లోకి కాసేపు నిశితంగా చూసి బయటకు అడుగులు వేసాడు చంద్రం.

ఇంటిగుమ్మం వద్ద స్కూటర్ ఆపగానే ఎదురొచ్చింది ఉమ.

చిన్నగా నవ్వి లోనికి అడుగులు వేసాడు చంద్రం.

హాల్లో కుర్చీలో కూర్చున్న జగన్నాథం లేచి చంద్రంకు ప్రతి నమస్కారం చేసి కూర్చోమని సోఫా వేపు సైగ చేసాడు.

ఒక పక్కన ఉమ తల్లి, అన్నయ్య భాస్కర్ కూర్చున్నారు.

నాన్న గారి వెనక నిల్చుంది ఉమ.

"నా పేరు చంద్రశేఖర్, మా పూర్వీకులది తూర్పు గోదావరి" అన్నాడు చంద్రం జగన్నాథాన్ని చూసి గౌరవంగా చేతులు కట్టుకుని.

"ఊ.. ఏం చదువుకున్నావు?" అన్నాడు జగన్నాథం సీరియస్‌గా చంద్రంని చూస్తూ.

"డిగ్రీ చేసి వ్యాపారం చేసుకుంటు న్నానండీ" అన్నాడు చేతులు రెండు సర్దుకుని, కస్తా ఇబ్బందిగా.

"అదేంటి.. ఉమ పీజీ చేసి రీసెర్చ్ కూడా అయిపోయింది తెలీదా?" అన్నాడు జగన్నాథం అదోరకంగా.

అది విని మరికాస్త ఇబ్బందిగా కదిలాడు చంద్రం.

"తెలుసండి. తాను ఇంకా చదవడానికి, ఉద్యోగం చేయడానికి నాకెటువంటి అభ్యంతరం లేదు. ఉమను నాకిచ్చి పెళ్లి చేయమని మిమ్మల్ని అడగటానికి వచ్చాను" అన్నాడు చంద్రం నింపాదిగా, జగన్నాథం గొంతులో హేళన పసిగట్టి.

"కానీ చూడు బాబు... నా కూతురికి తగిన వరుడిని తేవటం తండ్రిగా నా బాధ్యత. మరి నువ్వే విధంగా తనకు సూట్ అవుతావని అనుకుంటున్నావు" అని సూటిగా చంద్రం వేపు చూసాడు.

చంద్రం ఏమాత్రం తొణకకుండా "నేను, ఉమా మనస్ఫూర్తిగా ఆరు సంవత్సరాల నుండి అనుకుంటూ మీ అందరి ఆశీర్వాదం కోసం ఇప్పటివరకూ ఎదురు చూసాం. జీవితంలో తనకెలాంటి ఇబ్బంది రాకుండా చూసుకునే బాధ్యత నాది. ప్రస్తుతం నాకున్న సంపాదనతో మేం సంతోషంగా జీవితం గడపగలం" అన్నాడు చంద్రం. అతని గొంతు కాస్త మెత్తపడింది.

"చదువు అంతంత మాత్రమే, ఉద్యోగం లేదు, వ్యాపారం ఈ మధ్యనే కుదుట పడింది. మరిలాంటి పరిస్థితుల్లో కనీసం ఆస్తి కూడా లేని నీవు నా కూతురిని చేసుకోవాలని ఎలా అనుకున్నావు?" అని అడిగి చంద్రం పాదాల వంక చూసాడు.

పాదాలకు పాత సాక్స్ వదులుగా కనపడుతూ ఉన్నాయి.

"నాకెటువంటి బాధ్యతలు, బరువులు లేవు. పైగా మా నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి. మా మీద ఎప్పటికీ ఆధార పడాల్సిన అవసరం వారికెప్పుడూ ఉండదు. ఒకవేళ ఉన్నా దానిని భరించే సంపాదన నాకుంది" అని చెప్పటం ఆపి జగన్నాథం స్పందనకై చూసాడు.

జగన్నాథం మొహంలో ఎటువంటి భావం కనపడలేదు.

మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు చంద్రం "ఉమ అంటే మా ఇంట్లో అందరికీ చాలా ఇష్టం. మావి ఉమ్మడి కుటుంబాలే కనుక ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, చాలా ఆనందంగా జీవితాలు గడుపుతుంటాం. ఉమ నాకు ప్రాణంతో సమానం. తనకెటువంటి కష్టం రానివ్వనని మీకు మాటిస్తున్నాను" అని చెప్పి గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాడు.

"నాన్నా... మేమిద్దరం కలిసి, ఎవరికీ ఇబ్బంది లేకుండా సుఖంగా జీవితం కొనసాగించగలం, ప్లీజ్" అంది ఉమ మధ్యలో కలగజేసుకుని.

"నువ్వు కాసేపు మాట్లాడకు" కరకుగా అన్నాడు జగన్నాథం కూతురిని చూసి.

"ఉమ చెప్పేది కూడా సబబే కదా" అన్నాడు చంద్రం.

చిన్న చిరునవ్వు బలవంతంగా నవ్వి "సరే బాబు... సంతోషం. నేను ఆలోచించి కబురు చేస్తాను" అని చంద్రానికి స్నేహపూర్వకంగా చెప్పి, ఉమకేసి తీక్షణంగా చూసి– "అబ్బాయికి టీ తీసుకునిరా" అన్నాడు సీరియస్‌గా.

అందరూ మౌనంగా కూర్చున్నారు.

టీ తాగి లేచి నుంచుని "మరి నే వెళ్లొస్తానండి" అని నమస్కారం పెట్టి గుమ్మం వేపు అడుగులు వేసాడు చంద్రం.

"అవసరం అయితే నేనే ఫోన్ చేస్తాను" అన్నాడు. అతని గొంతులో అయిష్టత స్పష్టంగా తెలిసిపోతూ వుంది.

తిరిగి కుర్చీలో కూర్చుని ఏమీ మాట్లాడకుండా ఆలోచించసాగాడు జగన్నాథం.

> నేను వాళ్ల ఊరు వెళ్లి వారి ఉద్దేశం కనుక్కొని వస్తాను" అని లేచాడు చంద్రం. "జాగ్రత్తగా వెళ్లిరా, రాత్రి తిరుగు ప్రయాణం స్కూటర్‌పైన జాగ్రత్త" అన్నాడు ఉపేంద్ర.

అలాగే దాదాపు గంట గడిచిపోయింది. అతని మస్తిష్కం నిండా కూతురు భవిష్యత్తు పైన లెక్కలేనన్ని భయాలు ముసురుకోసాగాయి.

పీజీలో యూనివర్సిటీ ఫస్ట్, రీసెర్చ్‌లో గోల్డ్ మెడల్ తెచ్చుకున్న కూతురు ఇలా తప్పటడుగులు వేయడం అతనికి మింగుడు పడటం లేదు. ఎంతో చక్కగా రూపు దిద్దుకుంటున్న కూతురులో ఈ పరిణామం ఏంటి? కుటుంబం అంతా మంచి పద్ధతిలో పైకి వస్తున్న తరుణంలో దేవుడెందుకు ఇలాంటి శిక్ష విధించాడు? అనుకుంటూ భగవంతుడిని తిట్టుకోసాగాడు. అసలు ఇలాంటి పనికి వాడి మాయలో తన కూతురు ఎలా పడిందో! అని ఆలోచించసాగాడు.

"నాన్నా" పలకరించింది ఉమ.

ఏమీ మాట్లాడలేదు జగన్నాథం.

కూతురిని అయోమయంగా చూసాడు.

"పూర్తిగా మాట్లాడకుండా పంపించేశారు" మళ్లీ అంది ఉమ.

ఆ మాట వినగానే జగన్నాథంలో కోపం నషాళానికి అంటుకుంది.

"ఏముందని మాట్లాడను.. చదువు చట్టుబండలు లేని సన్యాసి. ఏం చూసి పెళ్లి చేసుకుందామని అనుకున్నావు, ఎంత బాగా చదువు చెప్పించాను నీకు, మంచి చదువు, అసిస్టెంట్ కలెక్టర్ ఉద్యోగం చేస్తున్న అబ్బాయిలు కూడా వచ్చారు. వాళ్లెవరూ నచ్చలేదని చెప్పి– ఇప్పుడు ప్రేమ, దోమా అని బుద్ధి లేని

పనులు. పైగా సరైన అబ్బాయిని ఎన్నుకోవటం తెలీదు. నీకు మంచి భర్తను తేలేనని అనుకున్నావా?" అన్నాడు. అతని కోపం తారాస్థాయికి చేరుకుంది.
"మంచి మనసు, సంస్కారం వున్నాయి చంద్రానికి" అంది కాస్త ఉక్రోషంగా.
"అంటే మాకెవరికీ సంస్కారం లేదన్నట్లా? అయినా అసలు ఏం పెట్టి సంసారం నడుపుతాడు. దేనికి కొదవ లేకుండా పెంచాను నిన్ను. రేపటి రోజున పిల్లలకు, నీకు సంఘంలో ఉన్నత స్థానం ఎలా కల్పిస్తాడు. ఏముందతడి వద్ద ఒడ్డూ పొడుతూ తప్ప. ఇలాంటి అబ్బాయిని ఎంచుకోవటం నీ తప్పు" అని అరిచాడు. అతడి గొంతులో విపరీతమైన కోపం, అసహనం ధ్వనిస్తూ వుంది.
"నాకెలాగూ ప్రొఫెసర్ వుద్యోగం వస్తుంది, తాను వ్యాపారంలో కుదురుకుంటాడని నమ్మకం నాకుంది. పైగా మంచి కుటుంబం" అంది గట్టిగా ఆత్మ విశ్వాసంతో.
"చాలా పెద్దదానివి అయిపోయావు. నీకు నేను చెప్పే మంచి అర్థం కావటం లేదు. అందరూ పెద్ద చదువులతో వున్న మనింట్లో అల్లుడుకి చదువు లేదంటే ఎంత అసహ్యంగా ఉంటుంది. నీది గుడ్డి ప్రేమ. అతనొక అసమర్థుడు, చదువు అబ్బని శుంఠ" అని కోపంగా అరిచాడు జగన్నాథం.
అతని ఊపిరి రెట్టింపై మొహం ఎర్రబడింది.
"అతనేమీ అసమర్థుడు కాదు. డిగ్రీలో మొదటి ర్యాంక్. ఇంట్లో పరిస్థితుల మూలంగా పై చదువులకెళ్లలేక వుండిపోయాడు" అంది. అలా అనడంలో ఆమెలో చిరాకు, విసుగు ప్రతిధ్వనించాయి.
"చాలు చాలు.. వెధవ ప్రేమలు. రేపొద్దున కూడు పెట్టవు. డబ్బులు లేకుండా ఏ పనులూ కావు. నేనూ కష్టపడ్డాను. అయితే చదువు మానలేదు, వారాలు చేసుకుని చదువు కొనసాగించా. ఎన్నో ఇబ్బందులు పడి మిమ్మల్ని పెద్ద చదువులు చదివించా" అన్నాడు.
ఆయన శరీరం ఉద్రేకంతో ఇంకాస్త వేడెక్కింది.
"కాదు నాన్నా.. నువ్వర్థం చేసుకోవటం లేదు, నేను చంద్రంని మనసారా ప్రేమించాను. నేనేం చిన్న పిల్లను కాదు. మీరు డబ్బుతో అన్నీ కొలవద్దు. డబ్బుతో అన్ని సంతోషాలు రావు" రోషంగా అంది తల వంచుకుని.
ఆ మాటతో జగన్నాథంలో కోపం కట్టలు తెంచుకుంది. సర్రున నిలబడి కూతురిని కొట్టడానికి కోపంగా చేయి లేపాడు. వెంటనే భయంతో అరిచి చేతుల్లో మొహం దాచుకుంది ఉమ.
తనను తాను అదుపులో పెట్టుకుని "ఛీ..ఛీ.. నా ఇంట్లో నుంచి వెళ్లిపో" ఉద్రేకంతో అన్నాడు.
"అలాగే నాన్నా వెళ్తా" అంది ఏమీ అర్థంకాని స్థితిలో.
"అయితే తగలడు. ఒక్క క్షణం కూడా నా ఇంట్లో ఉండొద్దు" అని అరిచాడు.
గిరుక్కున వెనక్కి తిరిగి గదిలోకి వెళ్లి సూట్‌కేస్ తీసుకుని బట్టలు సర్దుకోసాగింది ఉమ. కళ్ల నుండి నీళ్లు కారిపోసాగాయి. తలంతా మొద్దుబారిపోయింది. ఏం చేయాలో అర్థం కావటం లేదు. ఇంట్లో నాన్నకు, అమ్మ, అన్నయ్యలు ఎదురు చెప్పలేరు. ముందునుంచీ నాన్నది మొండితనమే అనుకుంటూ సెల్‌ఫోన్ తీసుకుని చంద్రంకు ఫోన్ చేసింది. కానీ నెంబర్ తగలలేదు. చిరాకుతో ఫోన్ విసిరిగొట్టి సర్టిఫికెట్స్ కూడా తీసుకుని లోపల పెట్టుకుంది.
"ఏమండీ, అది బట్టలు సర్దుకుంటోంది" అని మెల్లగా అంటున్న భార్య వేపు అపనమ్మకంతో చూసాడు జగన్నాథం.
"ఓహో... అంతదాకా వచ్చిందీ, అయితే ఇప్పుడే వెళ్లమను" అన్నాడు మరింత గట్టిగా.
సూట్‌కేసులు రెండు చేతుల్లో పట్టుకుని గది బయటకు వచ్చింది ఉమ.
"ఉమా... నాన్నేదో కోపంలో అంటున్నారు, నువ్వు లోపలికెళ్లు" అన్నాడు ఉమ అన్నయ్య భాస్కర్.
"లేదు.. నేను చెప్పినట్లు నడుచుకుంటేనే నా ఇంట్లో ఉండాలి" అన్నాడు జగన్నాథం విసురుగా.
కూతురు తనను కాదని బయటకు వెళ్లిపోవడానికి రెడీ కావటం తట్టుకోలేకుండా వున్నాడు. ఉద్రేకంతో చేతులు వణకసాగాయి.
అందరినీ చూసి, కంటిలో నీరు తుడుచుకుని, గట్టిగా ఊపిరి పీల్చి ఇంటి బయటకు అడుగులు వేసి తల్లి పిలుస్తున్నా ఆగకుండా రోడ్డుకిరువైపులా చూసి


నా ఇంట్లో నుంచి వెళ్లిపో" ఉద్రేకంతో అన్నాడు, తండ్రి. "అలాగే నాన్నా వెళ్తా" అంది ఏమీ అర్థంకాని స్థితిలో. "అయితే తగలడు. ఒక్క క్షణం కూడా నా ఇంట్లో ఉండొద్దు" అని అరిచాడు.


అప్పుడే అటుగా వెళ్తున్న ఆటోను చూసి చెయ్యి ఊపింది ఉమ.
దగ్గరగా వచ్చి ఆగిన ఆటోలో డ్రైవర్ని చూసి "రైల్వేస్టేషన్" అని ఎక్కి కూర్చుంది.
ఆకాశమంతటా మబ్బులు ముసురుకుంటున్నాయి... సన్నగా తుంపర మొదలైంది. రైల్వే స్టేషన్ చేరుకుని ఆటో దిగి పైకి మెట్లెక్కింది ఉమ. మొబైల్ తీసుకుని చంద్రంకు కలిపింది. ఫోన్‌లో లైన్ కలవటం లేదు. "నేను వచ్చేస్తున్నా ట్రైన్‌లో, స్టేషన్‌కు రా" అంటూ మెసేజ్ పెట్టి ఫోన్ బ్యాగ్‌లో పెట్టుకుని జిప్ వేసేసింది.
కౌంటర్ వద్దకెళ్లి హైదరాబాద్ టికెట్ కొనుక్కుంది. చేతికున్న వాచీ చూసింది ట్రైన్ వెళ్లడానికి ఇంకా రెండు గంటలుంది. ప్లాట్‌ఫారమ్ మీద జనాలు అక్కడక్కడ కనబడుతూ వున్నారు. సూట్‌కేసులు రెండూ లాక్కుంటూ వెళ్లి పక్కన వున్న బెంచీ మీద నిస్త్రాణంగా కూర్చుంది. వొళ్లంతా నీరసంగా అనిపించింది. మనసంతా అల్లకల్లోలంగా ఉంది. చెవుల్లో తండ్రి అన్న మాటలే వినపడసాగాయి. అలా ఆలోచిస్తూ ఉండిపోయి రెండు గంటల తర్వాత దడ దడ చప్పుడు చేస్తూ ట్రైన్ వచ్చి ప్లాట్‌ఫారం మీద నిల్చుంది.
ట్రైన్‌లో ప్రయాణికులు తక్కువగా వున్నారు.
స్త్రీల బోగీ ఎక్కి కూర్చున్న కాసేపటికి ట్రైన్ కదిలింది. వెనక్కి వెళ్లిపోతున్న తన ఊరిని చూడసాగింది ఉమ.
చూస్తుండగానే ఊరు దూరమైపోయి చీకట్లో కనపడకుండా పోయింది. కళ్లు మూసుకుని కిటికీకి తల ఆనించి పడుకుంది ఉమ. మనసంతా తండ్రి రూపమే నిండిపోయింది.
ట్రైన్ చీకటిని చీలుస్తూ హైదరాబాద్ వేపు పరుగిడసాగింది.
దాదాపు అర్ధరాత్రి సమయానికి ట్రైన్ హైదరాబాద్‌కు చేరుకుంది. ట్రైన్ దిగి చుట్టూ చూసింది ఉమ. చంద్రం ఎక్కడా కనపడలేదు. విసుగ్గా, బాధగా ఉంది ఉమకు. ఏం చేయాలో ఎటు వెళ్లాలో అర్థంకాని మానసిక ఒత్తిడిలో అలాగే నిలబడింది. ప్రపంచంలో తానొక్కతే ఒంటరిగా అయిపోయినట్లుగా అనిపించి నీరసపడిపోయింది. ఏం చేయాలో, ఎక్కడికెళ్లాలో అర్థం కాలేదు.
ప్రయాణికులందరూ గబగబా బయటకు వెళ్లిపోతున్నారు. కదలకుండా నిలబడ్డ ఉమను చూసి కొందరు మగాళ్లు ఎగాదిగా చూడసాగారు. ఇంతలో ఒకతను వచ్చి

"మేడం ఎటు వెళ్లాలి?" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

"ఎటూ లేదు.. నీకెందుకు? వెళ్లు" అంది కోపంగా.

"కోపమెందుకు మేడం? ఇక్కడే మా ఇల్లు" అన్నాడు నవ్వుతూ.

ఉమ సీరియస్‌గా చూసేసరికి వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు ఆ వ్యక్తి.ఇంకోవేపు నుంచి కొందరు మొరటు వ్యక్తులు తననే చూడటం గమనించింది ఉమ.

చంద్రంకు మళ్లీ ఫోన్ చేయసాగింది ఉమ. ఇంతలో చార్జింగ్ అయిపోయి ఫోన్ ఆఫ్ అయిపోయింది. ఎందుకు లేపలేదు చంద్రం, అసలేమైంది అని ఆలోచింపసాగింది. ఈ అర్ధరాత్రి రావడం తప్పేమో అనిపించింది. ఉమలో అంతవరకూ వున్న ధైర్యం నీరు కారిపోయింది. అప్పుడు కడుపులో ఆకలి, నీరసం మొదలైంది. రాత్రి భోజనం చేయలేదని గుర్తుకొచ్చింది. మనసంతా విరక్తి నిండిపోయింది. ఆమెలో ఒంటరితనం ఆవహించింది.

అక్కడే నిలబడి వున్న దూరంగా వస్తున్న ట్రైన్ వైపు చూడసాగింది. దానికింద దూకితే ఎలా ఉంటుంది అన్న ఆలోచన కలిగింది. ఆ వచ్చే ట్రైన్ కింద పడి చనిపోవడం బెటర్ అనుకుంది. ఈ సమస్యలన్నింటికన్నా అది మంచిదేమో అనే ఆలోచన వచ్చింది. ఒకే ఒక సెకనులో అన్ని బాధలకు దూరం కావచ్చు అనుకుంది.

సరిగ్గా అలా మనసులో ఆలోచన మొదలవుతున్న సమయంలోనే వెనక బోగీలో నుండి మెట్లు దిగి వస్తున్న ఒక వ్యక్తి కనిపించాడు. కళ్లు చిట్లించి చూసింది. కింద పడిపోతున్నట్లుగా మెల్లిగా అతి కష్టం మీద నడిచి వస్తున్నాడు.

ఆశ్చర్యంతో కొయ్యబారిపోయింది ఉమ. దగ్గరకు వచ్చిన తర్వాత చూస్తే అతను ఎవరో కాదు.. తన తండ్రి. "అంటే నాన్న నా వెనకే బోగీలో నా వెంటే వచ్చాడన్నమాట. నా వెనకే ట్రైన్ ఎక్కాడన్నమాట. నన్ను ఒంటరిగా వదలలేదు" అని అర్థం కాగానే ప్రపంచాన్ని జయించినంత సంతోషంతో ఉప్పొంగిపోయింది. మనసులో ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది ఉమకు. తండ్రిని చూసి వెయ్యి ఏనుగుల బలం వచ్చేసింది.



మెల్లిగా, నీరసంగా నడుస్తూ వచ్చి కూతురి ఎదురుగా నిలబడ్డాడు జగన్నాథం. జగన్నాథం మొహంలో ప్రపంచంలోని దుఃఖం అంతా అక్కడే కనబడుతూ ఉంది. ఎన్నో రోజుల నుండి లంఖణాలు చేసినట్లుగా అయిపోయాడు. వెంటనే చేతులతో తండ్రిని చుట్టేసింది ఉమ. దుఃఖం కట్టలు తెంచుకుని, కళ్లల్లో నుంచి సముద్రం ఉప్పొంగింది.

జగన్నాథం కూడా కూతురిని గుండెలకు హత్తుకుని బోరున ఏడవసాగాడు.చుట్టూ వున్నవాళ్లు వింతగా చూడసాగారు. పెద్ద శబ్దంతో వర్షం మొదలైంది. అలా చాలాసేపు ఉండిపోయారు.

"నాన్నా! నన్ను క్షమించు, నువ్వెలా చెప్తే అలా చేస్తాను" అంది ఉమ వెక్కి వెక్కి ఏడుస్తూ.

దూరంగా పెద్ద పిడుగు పడ్డ శబ్దం.

కూతురి తల నిమురుతూ "నీ సంతోషం నాకు ముఖ్యం తల్లీ, నువ్వెటూ వెళ్లవలసిన అవసరం లేదు. నేనున్నాగా, నువ్వు లేకుండా నేను బతకగలనా" అంటూ విలపించారు జగన్నాథం.

"ఇదే ట్రైన్ మన ఊరికి కాసేపట్లో తిరిగి వెళ్తుంది. నేను వెళ్లి టికెట్లు తెస్తాను" అని కూతురి కళ్లనీళ్లు తుడిచాడు జగన్నాథం. జేబులో చేయి పెట్టి మొబైల్ తీసి ఫోన్ చేయసాగాడు జగన్నాథం.

అంతక్రితం కాసేపటి ముందు వర్షంలో తడుస్తూ స్టేషన్లోకొచ్చిన చంద్రం దూరం నుండి ఇదంతా చూసి జరిగింది అర్థమై ఈ సమయంలో వారిద్దరినీ వదిలి వుండటం మంచిదనే నిశ్చయానికి వచ్చి సంతోషంతో తృప్తిగా స్టేషన్ నుండి వెనక్కి తిరిగాడు. అంతలో చంద్రం చేతిలో మొబైల్ మోగసాగింది. తీసి "హలో" అన్నాడు.

కళ్ల నీళ్లు తుడుచుకొని ఫోన్ చేస్తున్న తండ్రిని చూడసాగింది ఉమ.

"బాబూ చంద్రం! నేను ఉమ తండ్రిని. మంచిరోజు చూసుకుని మీ అమ్మ, నాన్నను తీసుకుని మా ఇంటికి రండి. మీ తల్లిదండ్రులను నేను ఆహ్వానిస్తున్నాను. పెళ్లి విషయాలు మాట్లాడుకుందాం" అని అంటున్న తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకుంది ఉమ.

"అలాగేనండీ, నమస్కారం" అన్నాడు చంద్రం. ఫోన్ వేపు చూసి తృప్తిగా నిట్టూరుస్తూ, కాసేపు స్టేషన్ బయట నిలబడి లోనికి వెళ్లాలా వద్దా అని ఆలోచించి తిరిగి స్టేషన్‌లోకి అడుగులు వేసాడు చంద్రం.

జగన్నాథ శర్మ వెళ్లి టికెట్స్ తీసుకొచ్చాడు. ముందుగా తాను ట్రైన్ ఎక్కి, పైకెక్కటానికి ఇబ్బంది పడుతున్న తండ్రిని చూసి చెయ్యందించింది ఉమ. తండ్రీ కూతుళ్లిద్దరూ తేలిక పడ్డ మనసులతో కూర్చున్న కాసేపటికి ట్రైన్ భారంగా ముందుకు కదిలింది.

బ్యాగ్‌లో నుండి మొబైల్ తీసి చార్జింగ్ పెట్టింది ఉమ.

వేగంగా వెనక్కెళ్లిపోతున్న ప్లాట్‌ఫారంను చూస్తున్న ఉమకు, అప్పుడే లోపలికొస్తూ తనను చూసి తృప్తిగా ప్రేమతో చేయి ఊపుతున్న చంద్రాన్ని చూసి ఆశ్చర్యంగా అన్నీ మర్చిపోయి మొహం నిండా నవ్వుతో, పట్టలేని సంతోషంతో చిన్న పిల్లలా చేతులూపింది ఉమ.

కూతురి మొహంలో కనపడుతున్న ఆనందాన్ని చూసి తృప్తిగా కళ్లు మూసుకున్నాడు తండ్రి జగన్నాథమ్.

బయట వాన వెలిసింది... మబ్బులు పలచబడ్డాయి.

ఫోన్ స్టార్ట్ చేసి చూసింది ఉమ. అందులో రాత్రంతా చంద్రం చేసిన మిస్డ్ కాల్స్ కనబడ్డాయి. ఆఖరున చంద్రం మెసేజ్ ఉంది "కమింగ్ టు స్టేషన్.. డోంట్ వర్రీ" అని. అప్పుడు తాను రాత్రంతా ఫోన్ బ్యాగ్‌లో పెట్టిన విషయం గుర్తుకు వచ్చింది.

అప్పుడే చీకటిని పారదోలుతూ తూర్పున అరుణకిరణాలు ఉదయిస్తూ వున్నాయి. వేల మనసులను, వారి లక్షల ఆలోచనలను, వారి బాంధవ్యాలను మోస్తూ ట్రైన్ ముందుకు పరుగులెత్తింది. ●

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపేగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

# ప్రజలు నివసించే అగ్నిపర్వత ద్వీపాలు హవాయి



పలు దీవుల సమూహం హవాయి. దీని మొత్తం వైశాల్యం 28 చదరపు కిలోమీటర్ల కంటే ఎక్కువ. ఈ హవాయి ద్వీపాలు సముద్రంలోని అగ్నిపర్వతాలు బద్దలై లావా ద్వారా ఆవిర్భవించాయి. ఆకాశ మార్గం నుండి చూస్తే నీలిసముద్రం, పచ్చదనం మధ్య నల్లని లావా, భయానక భూకంపాల వల్ల ఏర్పడిన బిలాలు, మంచు పొరలతో కప్పిన పర్వతాలు కనిపిస్తాయి. హవాయిలో 132 ద్వీపాలు ఉన్నాయి. వీటిలో ఎనిమిది ప్రధాన ద్వీపాలుగా గుర్తించారు. అవి హవాయి, మావి, కోహోలావే, మొలోకై, లానాయ్, ఓహు, కౌయి, నిహౌ. ఈ ఎనిమిది ప్రధాన హవాయి దీవుల గొలుసు మధ్యలో ఉన్న మొలోకై ద్వీపం సుమారు రెండు మిలియన్ సంవత్సరాల వయస్సు కలిగివుందని అంచనా. ఈ దీవుల్లో ఏడు మాత్రమే నివాసయోగ్యమైనవి. పర్యాటకులు విధిగా అయిదు దీవుల్ని సందర్శిస్తారు. వీటిలో హవాయి దీవి అన్నింటికంటే రెండు రెట్లు పెద్దది. దీన్ని బిగ్ ఐలాండ్ అని పిలుస్తారు. బిగ్ ఐలాండ్‌లోనే కిలియా అనే అగ్నిపర్వతం ఉంది. ప్రతి ఏడాది దీని నుండి వెలువడే లావా దాదాపు 40 ఎకరాల వరకు విస్తరిస్తుంది. మావి ద్వీపంలో అలా కాకుండా ఏ హడావిడి లేకుండా ప్రశాంతంగా ప్రకృతి అందాలతో రమణీయంగా ఉంటుంది. మావిలో ముఖ్యంగా చూడవలసినవి: హాలేకలా నేషనల్ పార్క్, రోడ్ టు హానా. మావిని 'ది వ్యాలీ ఐల్ అని కూడా పిలుస్తారు. ఇది హవాయిలో రెండవ అతి పెద్ద ద్వీపం. మావి దీవిలో కొన్ని చోట్ల జామ, నేరేడు చెట్లు కూడా కనిపిస్తాయి. ఇక్కడ అతిపెద్ద బీచ్‌లు ఉన్నాయి. వలస వచ్చే తిమింగలాలు నేత్రానందం చేస్తాయి. సూర్యోదయం, సూర్యాస్తమనం ఇక్కడ నయనానందం చేస్తాయి. ముఖ్యంగా హవాయిలోని అయిదు దీవులను పర్యాటకులు విధిగా సందర్శిస్తారు.

వీటిలో ఒకటి ఓహూ. ఈ ద్వీపంలో ఎక్కడ చూసినా కొబ్బరిచెట్లు, రకరకాల రంగుల్లో మందారాలు, విరగబూసిన కాగితపు, గన్నేరు, సువర్ణ గన్నేరుల పువ్వులు, నీలి సముద్రం, ఇంద్రధనస్సులు, అందమైన సూర్యాస్తమయాలు, గల గలా పారే సెలయేరులు, జలపాతాలు ప్రకృతి రమణీయత అంటే ఇలాగే ఉంటుందేమో అనిపించేలా ఉంటుంది. దీన్ని 'ది గాదరింగ్ ప్లేస్' అని పిలుస్తారు. ఇది మూడవ అతి పెద్ద ద్వీపం. 1952లో హవాయి దీవుల్లో పోలియో మహమ్మారి కారణంగా నిహౌ ద్వీపంలో బయటవారి ప్రవేశాలను నిషేధించారు. అందువల్ల కొంత కాలం దీన్ని 'నిషేధించబడిన ద్వీపం'గా పిలిచారు. కాయై అనే ద్వీపంలో దట్టమైన పచ్చదనం కనిపిస్తుంది. హవాయి దీవులన్నింటిలో ఇది అత్యంత సుందరమైనది. ఇక్కడ జలపాతాలు కనువిందు చేస్తాయి. చాలామంది పర్యాటకులు ఉల్లాసభరితంగా గడపడానికి కాయై ద్వీపాన్ని కోరుకుంటారు. దీన్ని 'గార్డెన్ ఐలాండ్' అని పిలుస్తారు. ఇది హవాయిలో నాల్గవ అతి పెద్ద ద్వీపం. హవాయి ద్వీప సముదాయాల్లోని ఓహూ ద్వీపంలోని పర్వతం మీద 3,922 మెట్లను నిర్మించారు. రేడియో స్టేషన్ కోసం వీటిని నిర్మించారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ రేడియో వినోద కార్యక్రమాల కోసం నిర్మించలేదు. 1942 ప్రాంతంలో అమెరికా నావికాదళం కోసం నిర్మించారు. ఈ రేడియో స్టేషన్ నావికా దళానికి 1943 నుండి అందుబాటులోకి వచ్చింది. 1970 నుండి రేడియో స్టేషన్ సేవలు నిలిచిపోయాయి. ఇరుకైన ఈ మెట్ల ద్వారా పర్వతాన్ని అధిరోహించడం ప్రమాదకరం. ఆ కారణంగా 1987 నుండి ఈ మెట్లను ప్రజలు ఎక్కడాన్ని నిషేధించారు. 2003 నుండి పర్యాటకులకు అనుమతిద్దామనుకున్నారు. కానీ ఇవ్వలేదు. అనుమతి లేకుండా కొంతమంది ఈ మెట్లు ఎక్కి

షేక్ అబ్దుల్ హాకీం జాని

సాహసాలు చేయాలనుకుని జైలుపాలయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ మెట్లను తొలగించాలని 2021 సెప్టెంబరులో ఇక్కడి అధికారులు తీర్మానించారు. ఓహూ ద్వీపంలో బైడో-ఇన్ టెంపుల్ పేరుతో బుద్ధుని ఆలయం ఉంది. ఇది జపాన్‌లోని క్యోటోలోని ఉజిలో ఉన్న 950 ఏళ్ల నాటి బౌద్ధ మందిరానికి ప్రతిరూపం. హుఐ అనే మరో ద్వీపంలో ఇంటర్నెట్ సౌకర్యం కూడా లేకుండా ఆటవికంగా కనిపిస్తుంది.

హవాయిలో అయిదవ అతి పెద్ద ద్వీపం మోలోకై. హవాయిలోని తెల్లని ఇసుక బీచ్‌లలో ఒకటైన పపోహా బీచ్ ఉంది. కొన్ని బీచ్‌లలో నల్లని ఇసుక, మరికొన్ని బీచ్‌లలో ఎరుపు, ఆకుపచ్చ, గులాబీ రంగుల్లో ఇసుక కనిపించడం విశేషం.

హవాయిలో అతి చిన్న ద్వీపం లానై. మావి నుండి ఈ ప్రదేశం తొమ్మిది మైళ్ల దూరంలో ఉంది. ఇక్కడ ఖరీదైన రెస్టారెంట్లు ఉన్నాయి.

అమెరికా రాష్ట్రంగా ఆవిర్భావం

హవాయి పడమర పసిఫిక్ మహాసముద్రంలోని ద్వీపాల సమూహం. 1800 ప్రాంతంలో మిషనరీస్ వారి వలసలతో ఇక్కడ పాశ్చాత్య నాగరికతకు అంకురార్పణ జరిగింది. 1810లో కమేహమేహ అనే వ్యక్తి హవాయికి రాజయ్యారు. ఈ ద్వీపాలు 1880 వరకు రాచరిక పాలనలో ఉన్నాయి. 1880లో అమెరికా భాగంగా మారింది. ఆ తరువాత నెమ్మదిగా అమెరికన్‌ల నియంత్రణలోకి వచ్చిన తరువాత ఈ ద్వీప సమూహం 21 ఆగస్టు 1959న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 50వ రాష్ట్రం ఆవిర్భవించింది. వేరే దేశపు నియంత్రణలో ఉంటే ఈ ద్వీపాలు ఎలా ఉండేవో కానీ, అమెరికా రాష్ట్రం అయినందువల్ల అందమైన పర్యాటక స్థలంగా, చాలా సురక్షితంగా ఉండేమో అనే భావన పర్యాటకులకు కలగక మానదు. హవాయి రాజధాని పేరు హోనోలులులో జన్మించారు.

హవాయిలోని ముఖ్యమైన ఐదు ద్వీపాలలో ప్రజలు హవాయి భాషను మాట్లాడగా, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఆంగ్ల భాషను మాట్లాడతారు. కానీ పురాతన హవాయి భాష కూడా ప్రాచుర్యంలో ఉంది.





## అగ్నిపర్వతాలకు నెలవు

అమెరికాలోని కాలిఫోర్నియా పశ్చిమాన హవాయి రెండు వేల మైళ్ల దూరంలో ఉంది. ఈ ద్వీపాలను జేమ్స్ కుక్ 18వ శతాబ్దం చివరిలో పర్యటించి శాండ్విచ్ దీవులు అని పిలిచారు. చాలా కాలం హవాయిని శాండ్విచ్ ద్వీపాలని కూడా వ్యవహరించేవారు. ప్రధాన ద్వీపాన్ని హవాయ్ అని పిలుస్తారు. ఇక్కడ ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతం ఉంది. దాని వల్ల ఈ ద్వీపానికి హవాయ్ అని పేరు వచ్చింది. హవాయ్‌లోనే అనేక ద్వీపాలలో అగ్నిపర్వతాలు ఉన్నాయి. అగ్నిపర్వతాల ద్రవపు లావా భూమి అడుగు నుండి సముద్రం పైభాగానికి వచ్చి ఒకదానిపై ఒకటి ప్రవహించి అగ్నిపర్వతాలు పగిలి నీటి నుండి బయటకు రావడం వల్ల హవాయి ద్వీపాలు ఏర్పడ్డాయి. సముద్రం అడుగున అనేక భూకంపాలు వచ్చి ఈ ద్వీపాలు ఎత్తయిన పర్వతాలుగా ఏర్ప డ్డాయి. హవాయి రాష్ట్రంలో ఇప్పటికీ ప్రత్యక్షంగా అగ్నిపర్వతాలన్నీ ఒకచోట ఉండటం వల్ల ఇది ఏర్పడింది. ఈ అయిదు అగ్నిపర్వతాలలో మూడు శక్తిని కోల్పోగా మిగిలిన రెండు చురుకుగా ఉన్నాయి. వీటిలో ఒకటి మౌనలోవా అగ్నిపర్వతం. ఇది 1950లో ఏకధాటిగా 23 రోజులు లావను వెదజల్లింది. ఆ లావ అంతా సముద్ర జలాలలో కలవడం వల్ల చాలా నీరు ఆవిరైంది. లావ వేడికి సముద్ర జలచరాలు అనేకం మరణించాయి. మౌనలోవా అగ్నిపర్వతం 1983 నుండి అప్పుడప్పుడూ విస్ఫోటనం చెందుతూనే ఉంది. రెండవ అగ్నిపర్వతం మావునాకి. ఇది పసిఫిక్ మహాసముద్రంలోకెల్లా ఎత్తయిన పర్వతం. ఇది సముద్ర మట్టానికి 4,200 మీటర్ల ఎత్తు ఉంటుంది. మావుయ్ అనే మరో ద్వీపంలో హాలియాకల అగ్ని పర్వతం ఉంది.

ఇది సముద్ర మట్టానికి 3,055 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఈ అగ్నిపర్వతం చాలా పెద్దది. దీని బిలంలోతు 830 మీటర్లు ఉంటుందని అంచనా. ఇన్ని అగ్ని పర్వతాలు ఉన్నప్పటికీ ఇక్కడ ప్రజలు నిర్భయంగా జీవనం సాగించడం విశేషం.

## సాహక క్రీడలకు నెలవు

హవాయిలో సముద్ర తీర ప్రాంతం అద్భుతంగా ఉంటుంది. ఇక్కడ సుందరమైన బీచ్‌లు ఆవిర్భవించాయి. ఈ సముద్ర జలాలపై సాహసాల క్రీడలలో పాలుపంచుకుంటేనే హవాయిలో వినోదం

(మిగతా 27వ పేజీలో)



# పుస్తక ప్రేమికుల బంధాలు గట్టివి

**"పుస్తకాలు అమ్మి నేనేమీ బోలెడంత డబ్బు సంపాదించలేదు. కానీ ఎందరో పరిచయ మయ్యారు. అది చాలు నాకు" అని రోడ్డు పక్కన పుస్తకాలు అమ్మే ఓ వ్యాపారి చెప్పాడు.**



అతను చెప్పిన మాటలన్నీ అనుభవపూర్వకమైనవి.

కోరుకున్న పుస్తకాన్ని అందరూ కొనుక్కోలేరు. అందుకు అనేక కారణాలు ఉండొచ్చు. వాటిలో ముఖ్యమైనది, ఇష్టపడిన పుస్తకాన్ని కొనడానికి తమ దగ్గర తగినంత డబ్బులు లేకపోవచ్చు. ఈ కారణంగా కొందరు తరచూ పాత పుస్తకాలు అమ్మే దుకాణానికి వెళ్లి తమకు కావలసిన పుస్తకాన్ని తీసుకుని అటూ ఇటూ తిప్పుతూ తృప్తి పడుతున్నవారు నాకు తెలుసు. అంతెందుకు.. అటువంటి వారిలో నేనూ ఒకడినే. మద్రాసులో ఉన్న రోజుల్లో మైలాపూర్, నుంగంబాక్కం, మాంబళం, ట్రిప్లికేన్.. ఇలా చోట్ల అమ్మే పుస్తకాల దుకాణాలకు వెళ్లి నాకిష్టమైనా కొనలేని పుస్తకాలుంటే వాటిని చూసి వస్తుండేవాడిని. అందులో ఓ తృప్తి ఉండేది. మరోవైపు బాధా ఉండేది కొనడానికి సరిపడా డబ్బుల్లేవని.

ఓసారి టీ నగర్‌లో ఓ పుస్తకాల దుకాణానికి (పాత పుస్తకాల దుకాణం కాదు, కొత్త పుస్తకాలు అమ్మే దుకాణం. తమిళం, ఇంగ్లీషు పుస్తకాలు అమ్మేవారు) తరచూ ఉదయంపూట వెళ్తుండేవాడిని. కొన్నా కొనకపోయినా వెళ్లి అక్కడి పుస్త కాలన్నింటినీ చూసి తిరిగొస్తుండేవాడిని. ఓ పది సార్లు వెళ్తే ఒక్కసారి కొనేవాడిని. అయితే ఓసారి ఏం జరిగిందంటే-

నేను దుకాణంలోకి అడుగు పెట్టడంతోనే ఆ పుస్తకాల యజమాని నన్ను ఆపి "మిమ్మల్ని కొన్ని రోజులుగా చూస్తున్నాను. తలుపులు తెరవడంతోనే లోపలికి వస్తున్నారు. ఓ గంటసేపు అటూ ఇటూ తిరిగి ఏదీ కొనకుండా పోతున్నారు. ఇకముందు ఇలా రాకండి. పుస్తకాలు కొంటేనే రండి" అని చెప్పాడు.

ఆ మాట నన్ను ఎంతో నొప్పించింది. దాంతో ఆ దుకాణానికి వెళ్లడం మానేసాను. అదలా ఉండనిచ్చి నాకు తెలిసిన ఓ విషయానికి వస్తాను.

ఓ ఫొటోగ్రాఫర్ విదేశీ ఫొటోలతో కూడిన పుస్తకాలను చాలాసేపు చూస్తుండే వాడు. అవన్నీ ఖరీదైన పుస్తకాలే. వేయి, రెండు వేల వరకు ఉండేవి. అతనిని చూస్తేనే తెలిసిపోతుంది. అతను అంత డబ్బు పెట్టి కొనలేరని.

ఓమారు నేను వెళ్లేసరికి అతను అక్కడ ఉన్నాడు. మంచి మంచి ఫొటోలతో ముద్రించిన ఓ పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పి అది ఎక్కడ ఉండేదో అక్కడ ఉంచి నీరసంగా వెళ్లిపోవడం చూశాను.

వెళ్తూ వెళ్తూ అతను ఓ ఫొటోగ్రఫీ పుస్తకాన్ని దుకాణం యజమానికి ఇచ్చి "అయ్యా! ఈ పుస్తకం ఎవరికీ అమ్మేయకండి, నేను డబ్బులు సమకూర్చుకుని వచ్చి దీనిని కొంటాను. అప్పటివరకూ లోపల దాచిపెట్టండి. ఓ వారం రోజుల్లో వచ్చి తీసుకుంటానన్నాడు".

ఈ మాటలు నేను విన్నాను.

ఆ పుస్తకాన్ని దుకాణం యజమాని ఎంతో జాగ్రత్తగా తీసి లోపల పెట్టాడు.

చెప్పినట్టే అతను ఏదో రోజు డబ్బులతో వచ్చి ఆ పుస్తకాన్ని కొనుక్కున్నాడు. ఆ రోజు అతని ముఖంలో కనిపించిన ఆనందం ఇంతా అంతా కాదు. ఇలా పుస్తకాలపై మక్కువ ఉన్నవారు నాకు పరిచయం. అటువంటి వారిని చూస్తే నాకు ఏదో చెప్పలేని ఆనందం.

ఓసారి ఓ పాఠకుడు ఓ పుస్తకాన్ని దుకాణం యజమానికి ఇచ్చి దాచమన్నాడు. త్వరలోనే వచ్చి కొనుక్కుం టానని అన్నాడు.

కానీ దుకాణం యజమాని ఆ మనిషి మాట మరిచి పోయి ఎవరికో ఆ పుస్తకాన్ని అమ్మేశాడు. వచ్చి కొనుక్కుంటానన్న మనిషి ఆ దుకాణానికి వచ్చి పుస్తకం అడిగాడు.

అతను "అయ్యో! ఎవరికో అమ్మేసానండి" అన్నాడు పుస్తక



దుకాణం యజమాని.

కానీ ఆ పాఠకుడు ఊరుకోలేదు. "అది ఎవరు కొనుక్కున్నారో గుర్తుంటే చెప్పమని" అడిగాడు. అతనింటికి వెళ్లి ఎలాగైనా బతిమాలి ఆ పుస్తకం అతనికి డబ్బులిచ్చి తీసుకుంటానన్నాడు. దుకాణం యజమాని ఎవరికీ అమ్మాడో అతని పేరు, చిరునామా చెప్పాడు.

ఆ పాఠకుడు ఎవరైతే ఆ పుస్తకం కొన్నాడో ఆ మనిషి ఇంటికి వెళ్లి తనను పరిచయం చేసుకుని "సార్! మీరు కొనుక్కున్న పుస్తకం నాకెంతో ఇష్టమండి. నేను అది చూసిన రోజు నా దగ్గర డబ్బు లేకపోతే దాచిపెడితే వచ్చి కొనుక్కుంటానని చెప్పాను షాపతనితో. కానీ అది మీకు అమ్మేసాడు. కనుక ఏమనుకోకపోతే నాకా పుస్తకం ఇస్తారా? మీకు కొన్ని దానికంటే ఎక్కువ డబ్బే ఇస్తానండీ" అన్నాడు.

అతను "డబ్బులు ఇవ్వక్కర్లేదని, మీకెంతో ఇష్టమైన పుస్తకం నాకూ ఇష్టమే. కానీ కోరుకున్న పుస్తకం కొనలేకపోయినప్పుడు కలిగే బాధేమిటో నేను అర్థం చేసుకోగలను. కనుక మీకు నేను ఈ పుస్తకాన్ని కానుకగా ఇస్తానని" ఇచ్చేసాడు. అయితే ఆ పాఠకుడు అతని దగ్గర సంతకం చేయించుకుని కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయాడు మహదానందంగా.

అంతేకాదు, ఆ రోజు నుంచి ఆ ఇద్దరూ మంచి మిత్రులైపోయారు.



వారిద్దరూ కలిసి ఆ పాత పుస్తకాల దుకాణానికి వెళ్లి దుకాణం యజమానితో కలిసి ఫొటోలు తీసుకున్నారు. ముచ్చట్లాడుకున్నారు. నాకీ సంగతిని దుకాణం యజమాని చెప్పి ఇలా మంచి మంచి వ్యక్తులతో నాకు పరిచయం అవడానికి కారణం ఈ పుస్తకాల వ్యాపారమేనండీ. నేను పెద్దగా పుస్తకాలు చదవను. కానీ చదివే వారిని చూస్తే ఎంతో సంతోషం వేస్తుందన్నాడు. పుస్తకాలతో ఏర్పడే బంధం బలమైనదని అతని నమ్మకమే కాదు, నాదీ అదే అభిప్రాయం. అందుకే పుస్తకాలంటే నాకూ మహా ఇష్టం. పుస్తకాలతో ఏర్పడే బంధమైతే మరీ మరీ ఇష్టం. ఈ ప్రేమానుబంధాన్నే పుస్తకాలు నేర్పిస్తాయి. పుస్తకాలను ప్రేమించే వ్యక్తి తనలాగే పుస్తకాలు ప్రేమించే అవతలి మనిషి మనసు అర్థమవుతుంది. పుస్తకాలు చదువుదాం! పరిచయాలు పెంచుకుందాం!! మంచి పుస్తకం చదివినప్పుడు అందులోని విషయాలను నలుగురితో పంచుకుందాం!!! అదిచ్చే ఆనందం అంతు లేనిదని వేరేగా చెప్పక్కర్లేదు.

**- యామిజాల జగదీశ్**

## ప్రజలు నివసించే ..

(25వ పేజీ తరువాయి)

పరిపూర్ణం అయినట్లుగా పర్యాటకులు భావిస్తారు. నీటి అడుగున డైవింగ్ చేయడానికి ప్రత్యేకమైన కేంద్రాలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. ఇంకా సెయిలింగ్, ఫిషింగ్, సర్ఫింగ్, కెట్బోర్డింగ్, విండ్ సర్ఫింగ్ మొదలైన సముద్ర జల క్రీడలకు హవాయి ప్రసిద్ధ పర్యాటక స్థలం. ఈ క్రీడా విన్యాసాలు చేసి అలౌకిక ఆనందాన్ని పొందడానికి ఎందరో సాహస పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తుంటారు.

## నీలి రంగు అరటిపండ్లు

మన ప్రాంతాలలో పసుపు, ఆకుపచ్చ అరటిపళ్లు; కేరళలో ఎరుపు అరటి పండ్లు లభిస్తాయి. హవాయిలో నీలిరంగు అరటిపండ్లు పర్యాటకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఆగ్నేయ ఆసియా, హవాయి దీవులు, దక్షిణ అమెరికాలోని టెక్సాస్, ఫ్లోరియా, కాలిఫోర్నియా, లూసియానా వంటి ప్రాంతాల్లో మాత్రమే ఈ పంటను సాగు చేస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్నారు. పసుపుపచ్చని అరటిపండ్లు మాదిరిగానే ఈ నీలిరంగు అరటిపండ్లలో కూడా అనేక పోషక విలువలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ నీలిరంగు అరటి పంటకు మార్కెట్లో బాగా డిమాండ్ ఏర్పడింది. నీలిరంగు అరటిపండ్లు వెనిలా ఐస్ క్రీమ్ రుచిని కలిగి ఉంటాయి. అందుకే దీనిని ఐస్ క్రీమ్ అరటి అని కూడా అంటారు. అలాగే ఈ నీలిరంగు అరటిని కెర్రీ, హవాయి అరటి వంటి పేర్లతోనూ పిలుస్తారు. వేప, సపోటా, నందివర్ధనం తప్ప భారతదేశంలో సముద్ర తీరం దగ్గర కనిపించే చెట్లన్నీ ఇక్కడ చూడవచ్చు. అరటి, మామిడి, ములగ, బొప్పాయి, పనస, జిల్లేడు, బాదాం, తుమ్మ, అనాస, సోంపు, మల్లె మొదలైన చెట్లు చాలా చోట్ల ఉంటాయి.

## హవాయి చెప్పులు

ఒకప్పుడు చెప్పులు అనే పేరు వింటే మనకి గుర్తొచ్చేవి హవాయి చెప్పులు. చాలా ఏళ్ల నుంచి కూడా హవాయి చెప్పులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ చెప్పులకి ఆ





పేరు రావడం వెనుక అనేక విషయాలు ప్రచారంలో ఉన్నాయి. హవాయి చెప్పులను ప్రపంచంలోని వివిధ దేశాలలో పలు పేర్లతో పిలుస్తారు. మన భారతదేశంలో మాత్రమే హవాయి అని పిలుస్తారు. ఈ చెప్పులు కేవలం భారతదేశంలో మాత్రమే కాకుండా ఈజిప్టు, జపాన్, చైనాలో కూడా ఉంటాయి. అమెరికాలో ఉన్న హవాయి ద్వీపం వలన ఈ చెప్పులకు హవాయి అనే పేరు వచ్చిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ద్వీపంలోని 'టీ' అనే చెట్టుకున్న రబ్బర్ నుంచి చెప్పులు తయారు చేస్తారు. ఈ కారణంగా వీటికి హవాయి అనే పేరు వచ్చింది. పైగా చెప్పులు గాలిలా తేలికగా ఉంటాయి. అందుకనే వీటికి హవాయి చెప్పులు అనే పేరు వచ్చిందని కూడా అంటూ ఉంటారు. ఏది ఏమైనా నేడు అను నిత్యం పర్యాటకుల సందడితో హవాయి దీవులు కళకళలాడుతున్నాయి. ❏



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. శత్రువులు మిత్రులవుతారు. పెద్దల పట్ల మీ కర్తవ్యం సక్రమంగా నిర్వహిస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నాయి. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. వాహన యోగం.

## వృషభం



అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. కుటుంబంలో స్వల్ప మనస్పర్థలకు ఆస్కారం. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహ రుణాలు తీరుస్తారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు విజయం.

## మిథునం



కుటుంబ గౌరవం పెంపొందుతుంది. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఎదురు చూస్తున్న శుభ వర్తమానం వారాంతంలో అందుకుంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. భాగస్వామ్య వ్యాపారులు విడిపోతారు.

## కర్కాటం



దుర్వ్యసనాలు విడిచిపెడతారు. కళాకారులకు కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. ఊహించని వార్తలు వింటారు. సంతానాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. స్త్రీలతో మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. వాహన యోగం.

## సింహం



వృధా కాలక్షేపం చేస్తారు. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. దేశాంతర ప్రయాణం చేస్తారు. చోర భయం పొంచి వుంది కనుక ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. స్త్రీలకు శుభ యోగం.

## కన్య



సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. శత్రువులు మిత్రులవుతారు. వస్తువులు కొనుగోలు-అమ్మకం వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. చిరకాల కోరిక నెరవేర్చుకుంటారు.

## తుల



ధర్మ రక్షణకై పాటుపడతారు. వృధా ఖర్చులుంటాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. ఎదురు చూస్తున్న శుభ వార్త తెలుస్తుంది. దూర దేశ ప్రయాణ సూచనలు అధికంగా వున్నాయి. స్త్రీలకు శుభ యోగం. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులు ఉంటాయి. కాలానుగుణంగా చేసే వ్యాపారాలు లాభిస్తాయి.

## వృశ్చికం



విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. చిన్ననాటి మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. శత్రువులు మిత్రులవుతారు. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తారు.

## ధనుస్సు



వృత్తి వ్యాపారస్తులకు పోటీ ఏర్పడుతుంది. సామాన్య ధన లాభాలుంటాయి. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి. శత్రువులు మిత్రులవుతారు. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుది. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక నెరవేరుతుంది. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు.

## మకరం



వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యవసాయదారులకు బాగుంటుంది. వృత్తి విద్యాకోర్సుల్లో చేరతారు. విదేశీ ప్రయాణ ఫలితాలు ఫలిస్తాయి. బాల్య మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారులకు అనుకోని విధంగా కొన్ని చోట్ల స్వల్ప నష్టాలు వస్తాయి. సంయమనంతో ప్రవర్తించండి. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు.

## కుంభం



శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. విద్యారంగంలో వున్నవారికి బాగుంటుంది. నిరుద్యోగులకు శుభ వార్త తెలుస్తుంది. చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు/వస్తువుల పట్ల జాగ్రత్తలు పాటించండి. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. మొండి బకాయిలు వసూలవుతాయి.

## మీనం



ఉద్యోగులకు స్థాన చలనం/పదోన్నతి సూచనలున్నాయి. ఆదాయానికి మించిన ఖర్చులు అసహనం కలిగిస్తాయి. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. వ్యవసాయ భూమి కొనుగోలు చేయాలన్న ఆలోచన ఫలిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరు. క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది.

# తెలుగు భాషా వికాస స్వరూపం

**కవిశేఖర పానుగంటి లక్ష్మీనరసింహారావు 1913-1933 మధ్య కాలంలో నాటి సామాజిక పరిస్థితులను హాస్యపూర్వకంగా ఎండగడుతూ సాక్షి వ్యాసాలు చిక్కనైన గ్రాంథిక భాషలో రచించారు.**

తెలుగు సాహిత్యానికి అమూల్య ఆభరణాలైన ఆ సాక్షి వ్యాసాలు, అయిదు అంకాల రాధాకృష్ణ నాటకం, సారంగధర చరిత్ర, నర్మదా పురుకుత్సీయం, కోకిల, విప్రనారాయణ చరిత్ర, వీరమతి, పూర్ణిమ వంటి ప్రముఖ రచనలు నాటక కవిగా అభినవ కాళిదాసు, ఆంధ్రా అడిసన్, ఆంధ్రా షేక్స్పియర్‌గా తెలుగు సాహితీ వినీలాకాశంలో ప్రత్యేక స్థానాన్ని అందించాయి.

1865లో జన్మించిన పానుగంటి రచనా కాలంలో ఆంగ్ల, సంస్కృత భాషల ప్రభావం చిక్కనైన తెలుగులో రచనలు వెలువరించే సందర్భం అది. అయినా వ్యవహార పలుకుబడికి దగ్గరగా వుండే శైలితో నాటి సామాజిక రుగ్మతలపై ఆంగ్ల రచయితలు జోసఫ్ అడిసన్, రిచర్డ్ స్టీల్ ప్రేరణతో పానుగంటి సాక్షి వ్యాసాలు రచించారు. ఈ సాక్షి వ్యాసాలలో కాలాచార్యుడు, జంఘాల శాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి వంటి పాత్రలతో సంభాషణల రూపకంగా సందేశాన్ని అందిస్తారు. తొలినాళ్లలో సంపాదించినా, అవసాన దశలో పేదరికం, ఋణబాధలకు పానుగంటివారు గురి అవవలసి వచ్చింది.

**"నాకెవరును దానధర్మము చేయనక్కరలేదు. తగ్గింపు ధరలకు పుస్తకాలు కొని నా మానుషమును కాపాడితే నాకు సివిలుఖైదు తప్పును"** అని రాయవలసి వచ్చింది. సాక్షి "జంఘాల శాస్త్రి" పాత్ర పానుగంటివారికి ఎనలేని పేరు తెచ్చింది. 1935లో పిఠాపురం ఉత్సవాల సందర్భంలో పుర ప్రజలు ఏర్పాటు చేసిన సన్మానానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. 1865 ఫిబ్రవరి 11న జన్మించిన పానుగంటి లక్ష్మీనరసింహారావు 1940 జనవరిలో స్వర్గస్థులయ్యారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం, కూచి నరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహం ముగ్గురు రచయితలను ఆ రోజులలో సింహత్రయం అనేవారు. 1890లో చిలకమర్తి, నర నారాయణ సంగ్రామంగా 'గయోపాఖ్యానం' నాటకం వెలువడింది. చిలకమర్తి మహాకవిగా, కళా ప్రపూర్ణగా తెలుగు సాహిత్యాన్ని కవి, రచయిత, నాటకకర్త, సంఘ సంస్కరణవాదిగా, దేశభక్తునిగా చిరఃస్మరణీయ కీర్తి ప్రతిష్ఠలు పొందారు. 1867 సెప్టెంబరు 26న జన్మించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం కీచక వధ, ద్రౌపదీ పరిణయం, శ్రీరామ జననం, ప్రహ్లాద చరిత్రం వంటి పలు నాటకాలు రచించారు. సామాజిక ఇతివృత్తాలతో గణపతి, రామచంద్ర విజయం, రాజరత్నం, విజయలక్ష్మి వంటి నవలలు రచించారు. చరిత్ర సంబంధిత నవలలు, సంస్కృత, ఆంగ్ల అనువాద నవలలతో, రాజస్థాన్ కథలు, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. సరస్వతి, మనోరమ, దేశమాత వంటి పత్రికలకు సారధ్యం వహించారు.




1946 జూన్ 17న స్వర్గస్థులైన చిలకమర్తి, రంగస్థలంపై ప్రదర్శించడానికి గయోపాఖ్యానం వంటి నాటకాలు పూర్వ కవుల పౌరాణిక, చారిత్రక పద్యకావ్యాలు ఆధారంగా కథ ప్రధానంగా సులభ శైలిలో జనరంజకంగా రమణీయంగా రచించారు. తెలుగులో ఆంగ్ల సాహిత్య ప్రభావంతో, కందుకూరి వీరేశలింగం సాంఘిక దురాచారాలపై అప్పటికే ప్రహసనాలు, చిన్న నాటకాలు ప్రారంభించారు. 1880లో ధార్వాడ నాటక సమాజం, ఎక్కువగా మహారాష్ట్ర నాటకాలను, హిందీ నాటకాలను, ఆంగ్ల నాటక ప్రదర్శనల ఫక్కీలో తెలుగునాట మనోహరంగా ప్రదర్శించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడం, ఆంధ్ర నాటక రంగ ఆవిర్భావానికి ప్రోత్సాహం కలిగించింది. పురాణాలు, దేశ చరిత్రల నుండి నాటకాలు బయలుదేరాయి.

వీరేశలింగం, ధర్మవరము కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేదం వేంకటరాయశాస్త్రి, పానుగంటి లక్ష్మీనరసింహం ప్రదర్శనకు యోగ్యమైన పలు నాటకాలు ఆ కాలంలో వెలుగు చూసాయి. అంతకు ముందు ఆంధ్ర దేశంలో 'పారిజతాపహరణం' వంటి యక్షగాన రూపంలో రంగస్థలం అవసరం లేకుండా, వీధి నాటకాలు వుండేవి. ప్రహ్లాద చరిత్ర, రామనాటకం అటువంటివే.

కూచిపూడి భాగవతులు కాలికి గజ్జె కట్టి దైవ సన్నిధిలో నృత్యాలు చేసేవారు.

యక్షగాన నాటకాలు నాయక రాజుల కాలంలో తంజావూరులో రఘునాథ నాయకుడు, విజయ రాఘవుడు, రంగాజమ్మ రచించిన మన్నారుదాస విలాసం వ్యవహారిక భాష స్వరూపంలో హాస్య సంవాదనలుగా గాన వినోద ప్రధానంగా వుండేది. తర్వాత సంస్కృత నాటక అనువాదాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రీకరింపబడిన సంస్కృత నాటకాలలో వావిలాల వాసుదేవ శాస్త్రి ఆంధ్రీకరించిన 1880 నాటి ఉత్తర రామచరిత్ర మొదటిదిగా పేర్కొనబడుతోంది. సాహిత్యం నాటకాంతం అనే మాట తెలుగుకు వర్తించదు. ఆధునికాంధ్ర గద్య శైలికి వీరేశలింగంగారే ఆద్యులనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. 1937లో ముద్రించబడిన ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరిలో జయంతి రామయ్య పంతులు గ్రాంథిక వాదిగా భాషా వికాస స్వరూపాన్ని వివరించారు.

**- జయసూర్య**

# చరిత్రను పరవశింపచేసిన కన్నడ సినిమా



**చిత్రభారతి**

**వాశిరాజు ప్రకాశం**

**మహనీయులు.. వారు వారు చేసిన అద్భుతమైన కృషి, ప్రదర్శించిన ప్రతిభతో జీవించినంత కాలం ఆ నేలతల్లికి ముద్దుబిడ్డలై వుంటారు. కానీ అనంత లోకాలకు వెళ్లిపోయిన తరువాత, "ఆయన మన మధ్యనే వున్నారు, ఎక్కడికీ వెళ్లలేదు, వెళ్లరు" అన్న భావం కలిగించిన వ్యక్తి, మహనీయులు, మానవతకు మారు పేరు కన్నడ కంఠీరవుడు రాజ్‌కుమార్.**

తాను జీవించిన సుదీర్ఘ కాలంలో ఏ రోజూ వివాదంలోకి వెళ్లకపోగా, అందరినీ ఆత్మబంధువులా ఆదుకున్నారు. దాదాపు అర్ధ శతాబ్దం కాలం వెండితెర మీద వెలుగులు విరజిమ్మిన రాజ్‌కుమార్ అసలు పేరు సింగనల్లూరు పుట్టుస్వామి ముత్తురాజు. ఈ పేరు పెద్దది కావటంతో కన్నడ సినిమా ఆయనకు రాజ్‌కుమార్‌గా పేరు పెట్టటం మాత్రమేగాక, శాశ్వతంగా అందరి పెదవుల మీద దరహాసం చేసేలా 'కన్నడ కంఠీరవ'గా బిరుదు ఇచ్చారు. ఆయన వెళ్లిపోయినా కన్నడ కంఠీరవుడే. కారణం.. యిప్పటికీ ఎప్పటికీ మరో కన్నడ కంఠీరవుడు కన్నడ సీమలో జన్మించరు.

1954వ సంవత్సరంలో రాజ్‌కుమార్ వెండితెర అరంగేట్రం చేసారు. తొలి చిత్రం 'బేదర కన్నప్ప' విజయఢంకా మోగించటంతో కొత్త కొత్త నిర్మాతలు ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఆయన మాత్రం అత్యాశకు పోయి వచ్చిన ధనాన్నంతా మూట గట్టుకోలేదు. సంవత్సరంలో పది సినిమాలు మాత్రమే చేసిన ఈ కంఠీరవుడు తాను జీవించిన కాలంలో మొత్తం నాలుగు వందలలోపు చిత్రాల్లో నటించారు. పారితోషికం కూడా చాలా క్లుప్తంగా తీసుకునేవారు. అందుకు కారణం చెప్తూ- "ఎక్కువ డబ్బు తీసుకుని ఏం చేస్తాం? మౌనంగా మహర్షిలా వెళ్లిపోవాలేగానీ రత్నాలు, వజ్రాలు మనకు ఎందుకు?" అనేవారు. అదనంగా లభించిన ఈ ధనాన్ని ఆయన పేదల సౌభాగ్యానికి వినియోగించారు. చాలా కాలం ఒక్కో సినిమాకు ఆయన రెమ్యునరేషన్ నలభై వేలు.


ఒకసారి ఆయన నిర్మాతలందరూ సమావేశమై ఆయన ఇంటికి వెళ్లి "బొత్తిగా ఈ నలభై వేల పారితోషికం చాలా తక్కువగా ఉంది, కొంతయినా పెంచండి" అని అడిగితే వారి మాటలు కాదనలేక ఒక శుభ ముహూర్తాన ఆయన ఇంటికి నిర్మాతలందరినీ విందు భోజనానికి ఆహ్వానించి, అందరి మనఃపూర్వకమైన అంగీకారంతో నలభై వేల నుండి యాభై వేల వరకు పెంచారు.





అప్పటికే ఒక్కో సినిమాకు లక్ష రూపాయలు యివ్వటానికి నిర్మాతలు సిద్ధంగా వున్నా ఆ ఆశ, భావన తన మనస్సులోకి రానివ్వలేదు. ఆయన అర్ధాంగి పార్వతమ్మ ఇదంతా చూసి "తన భర్త ఇంత సౌమ్యుడా?" అని ఆనందించారు. ఆ ఇంటికి మహారాణి పార్వతమ్మగారే. సంతానాన్ని యోగ్యులుగా, ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారు. రాజ్‌కుమార్ సినీ రంగం విరమణ చేసిన తరుణంలో అభిమానులు ఆ పరిణామం అంగీకరించక బెంగళూరులోని ఆయన ఇంటికి వెళ్లి ధర్నాలు చేశారు, నిరాహార దీక్షలు చేశారు. వారందరి మాట కాదనలేక చివరిగా "ఒక్క సినిమా చేస్తాను. ఆ తరువాత ఇక అడగవద్దు" అని 'శబ్దభేది'లో చిత్రంలో నటించారు. అందులో ఆయన క్రమశిక్షణా యుతమైన పోలీసు ఆఫీసరు. పోలీసు శాఖలో చాలా మంది ఆ చిత్రం చూసి ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నారని అప్పట్లో చెప్పుకున్నారు. తెలుగువారి ప్రియతమ తార జయప్రదను ఎంచుకోవటం గురించి చెప్తూ "మనమంతా భారతీయులం. ఒక తల్లి బిడ్డలంగా జీవించాలి. మనం అందరికీ ఆదర్శం కావాలి. అందుకే జయప్రదను హీరోయిన్‌గా ఎంపిక చేశాం" అన్న రాజ్‌కుమార్ మాటల్లో ఎంతటి సంస్కారం వుందో అర్థం అవుతుంది. ఈ సినిమా బెంగళూరు థియేటర్లలో ఒక సంవత్సర కాలం ఆడింది.

రాజ్‌కుమార్ జీవితంలో ఒక ఆశ్చర్యకరమైన ఘట్టం.. గంధపుచెక్కల దొంగ వీరప్పన్ ఆయనను కిడ్నాప్ చేసి తన నివాసమైన అరణ్యవాసానికి తీసుకువెళ్లారు. జరిగింది కిడ్నాపే అయినా వీరప్పన్ రాజ్‌కుమార్‌కు ఎలాంటి కొరతా లేకుండా చూసుకున్నాడని అప్పట్లో చెప్పుకునేవారు. అడవిలో చల్లని ఆకాశం కింద సేద తీరే విధంగా మంచి పడక వేయించారు. ఆ రోజుల్లో రాజ్‌కుమార్‌కు మోకాళ్ల నొప్పులుండేవి. వాటికి కావలసిన నెమలిరేకుల ఔషధాన్ని తెప్పించి, వీరప్పన్ తానే స్వయంగా సేవలు చేసి, ఆ తరువాత తొంభై తొమ్మిది రోజుల అరణ్య వాసం నుండి బెంగళూరు వీరప్పన్ స్వయంగా పంపించారు. తనకు ఏ ఇబ్బంది రాలేదని రాజ్‌కుమార్ పత్రికలకు ఆనందంతో చెప్పారు. ఇవాళ రాజ్‌కుమార్ లేరు, పార్వతమ్మ ఆయనకు సేవలు చేసేందుకేనేమో తానూ అనంత లోకాలకు వెళ్లారు.

వారు లేని కొరత లేకుండా ఆ కుటుంబం సైతం నిజమైన నట వారసుల కుటుంబంగా మూడు పువ్వులు ఆరు కాయలుగా వృద్ధి చెందటం సినిమాతల్లికి మందహాసం.. అభిమానులకు ఆనందోత్సవ వేడుక! ◆


ఇది మీ ఫ్రిజ్‌లో పెట్టు.. ఆయనొచ్చాక తీసుకుంటా..
నీ కూర అని చెబితే లొట్టలేసుకుని తింటారు..!


నో.. మా.. నేను స్నానం చేయను.. కష్టపడి తెచ్చుకున్న
కాళేశ్వరం జలాలను వృథా చేయను...!!


గూగుల్ మ్యాప్ పెట్టుకోకుండా.. ఇంటి అడ్రస్
గుర్తు పెట్టుకుని... ఇంటిదాకా వచ్చావు చూడూ...
నీవురా ఫ్రెండంటే...!!

ఈ వారం కా'ర్టూన్స్'

## ఫోటో ఫీచర్



ఐర్లాండ్ దేశంలోని వింతల్లో ఇది ఒకటి. దీనిని జెయింట్ కాజ్‌వే అని పిలుస్తారు. సముద్రపు కోత నుంచి నేలను రక్షించుకోవడం కోసం రాతి దిమ్మెలను పేరుస్తారు. సముద్రపు అంచున వంతెన కట్టాలనా రాతిదిమ్మెలు ఒక వరుస క్రమంలో పేరుస్తారు. అలాంటి వరుసే ఈ వంతెన. కానీ ఇది పకృతిసిద్ధంగా ఏర్పడిన వంతెన.

